www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 81 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com బుధవారం 08 - 07 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



హైదరాబాద్ వాసులకు శుభవార్త.. తిరుపతి, అరుణాచలం, శ్రీరంగానికి నేరుగా రైలు!

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ


## మరో 11 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

- రూ.9076 కోట్ల పెట్టుబడులు, 10 వేల ఉద్యోగాలు
- సీఎం అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం
- పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖల ప్రాజెక్టులపై చర్చ
- రూ.9,076 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 11 ప్రాజెక్టులపై చర్చ
- రైతు కుటుంబాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం
- పర్యాటక రంగం అభివృద్ధికి 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు
- ఇథనాల్, సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.9,076.11 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 10,531 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రైతు కుటుంబాలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ఇథనాల్‌కు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో, ఆ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి ఒక ప్రత్యేక పాలసీని రూపొందించాలని ఆదేశించారు.పర్యాటక రంగంలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 పర్యాటక ప్రాంతాల్లో 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం, గండికోట, లంబసింగి - మిగతా 2 లో


# ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి పుట్టినిల్లు




- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం
- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి
- విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళా మహోత్సవంలో పాల్గొన్న పవన్

జాతి గొప్పతనం నిర్మాణాల్లో కాదు, కళాకారుల పనితనంలో ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి చాటుతున్నాయన్నారు. హస్తకళా రూపాలు ప్రపంచానికి చేరాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ అవసరం అన్నారు. వృద్ధమని - మిగతా 2 లో


# ఏపీకి పెట్టుబడుల వేట



- కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు
- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీ
- ఎల్జీ, శాంసంగ్, హ్యుందాయ్ మోబిస్ వంటి దిగ్గజ సంస్థలతో భేటీ
- కాకినాడ, విశాఖలో యూనిట్లు, ఈవీ సెమీకండక్టర్ హబ్ ఏర్పాటుకు విజ్ఞప్తి

**అమరావతి :** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ - మిగతా 2 లో

# భోగాపురం విమానాశ్రయం సిద్ధం!



- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు
- అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి

**అమరావతి :** ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం - మిగతా 2 లో

# వయనాడ్‌లో మరోసారి విరిగిపడిన కొండచరియలు



- శిథిలాల కింద పలువురు!
- వయనాడ్‌లో భారీ వర్షాలు
- సొరంగం నిర్మాణ పనుల వద్ద కూలిన కొండచరియలు
- ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు

**కేరళ :** కేరళలోని వయనాడ్‌లో మరోసారి కొండచరియలు బీభత్సం సృష్టిస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అనక్కంపొయిల్-కల్లాడి టన్నెల్ ప్రాజెక్టు వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రకటించారు. ఈ దుర్ఘటనలో మరో ఏడుగురు గల్లంతయ్యారని, వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.అధికారుల వివరాల ప్రకారం, కల్లాడిలోని మీనాక్షి వంతెన సమీపంలో టన్నెల్ నిర్మాణానికి సంబంధించి తవ్వకాలు జరుగుతున్న సమయంలో భారీగా మట్టి జారిపడింది. అక్కడే కార్మికుల తాత్కాలిక నివాసాలు ఉండటంతో - మిగతా 2 లో

# ఇండోనేషియాకు భారత్ బ్రహ్మోస్ క్షిపణులు

- భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్
- ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించేందుకు భారత్ ఒప్పందం
- సుమారు రూ.1900 కోట్లతో డీల్
- ఫిలిప్పీన్స్, వియత్నాం తర్వాత బ్రహ్మోస్ కొన్న మూడో దేశం ఇండోనేషియా
- అస్త్రా క్షిపణులు, సాంకేతిక బదిలీపైనా కీలక ఒప్పందాలు
- భారత్, రష్యా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణి అభివృద్ధి




**ఢిల్లీ :** రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ.1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరు దేశాల మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది.ఈ - మిగతా 2 లో

# కడియం శ్రీహరిపై రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన కొండా సురేఖ

- కాంగ్రెస్ పార్టీలో కొండా సురేఖ వర్సెస్ కడియం శ్రీహరి
- తన శాఖ అధికారులతో తనకు సమాచారం ఇవ్వకుండా కడియం సమీక్ష నిర్వహించారన్న సురేఖ
- మంత్రిగా తన పరిధిని బేఖాతరు చేశారని మండిపాటు
- కడియంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ :** మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య ఆధిపత్య పోరు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతోంది. కడియం శ్రీహరిపై ఏకంగా సీఎం రేవంత్ రెడ్డికి కొండా సురేఖ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అయిన తనకే కనీస సమాచారం ఇవ్వకుండా... ఆ శాఖ ఉన్నతాధికారులతో కడియం ఏకంగా అధికారిక సమీక్ష నిర్వహించారంటూ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఆమె నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూడు పేజీల లేఖ రాస్తూ - మిగతా 2 లో



# పార్టీ పేరు వివాదం.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత



- తన కొత్త పార్టీ పేరు వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత
- 'టీఆర్ఎస్' పేరుపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎన్నికల సంఘం
- ముందుగా ఈసీకి వివరణ ఇవ్వాలని కవితకు సూచించిన ఉన్నత న్యాయస్థానం

**హైదరాబాద్ :** కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ పేరు నమోదుకు సంబంధించి నెలకొన్న వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పేరుకు అనుమతినిచ్చేలా - మిగతా 2 లో

# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు





- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన
- తాడిచెర్ల-2 బ్లాక్ కూడా కేటాయింపు
- నైనీలో 35 ఏళ్లకు సరిపడా నిల్వలు
- రూ.75 వేల కోట్ల ఆదాయం అంచనా

**హైదరాబాద్ :** సింగరేణికి మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు దక్కనున్నాయి. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు.ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు.ఢిల్లీలో మంగళవారం - మిగతా 2 లో

# హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లోని నాచారంలో బాలామృతం ప్లాంటు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- బాలామృతం ప్లాంటు నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా అభివృద్ధి చెందుతుందని వెల్లడి
- ఉప్పల్‌ను అభివృద్ధి చేస్తామని హామీ
- ఏటా రూ.25 వేల కోట్లు విద్య కోసం ఖర్చు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం



**హైదరాబాద్ :** నాచారంలో ఏర్పాటు చేసిన బాలామృతం ప్లాంటు నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని నాచారంలో బాలామృతం ప్లాంటు సీఎం ప్రారంభించిన అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆరేళ్ల వరకు బాలామృతం ఇస్తామని, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని సీఎం తెలిపారు. ఏటా రూ.25 వేల కోట్లు విద్య కోసం ఖర్చు చేస్తున్నామని, టీచర్లు, సిబ్బందికి అల్పాహారం, భోజనం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.2 కోట్లకు పైగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్న రేవంత్ రెడ్డి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు రూ.10 వేలు ఆదా అవుతుందని తెలిపారు. ఆర్టీసీకి ప్రభుత్వం రూ.11 వేల కోట్లు చెల్లించిందని, 3.28 కోట్ల తెలంగాణ బిడ్డలకు సన్న బియ్యం అందిస్తున్నామని గుర్తు చేశారు. త్వరలో హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో 4.5 లక్షల ఇళ్లు కట్టామని పేర్కొన్నారు. పట్టణాల్లో - మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్‌కు మళ్లీ భంగపాటు

చరిత్ర తెలుసుకోకుండా, తన పరిమితులేమిటో గ్రహించకుండా ఎడాపెడా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశ సుప్రీంకోర్టు నుంచి మరోసారి చుక్కెదురైంది. అమెరికా గడ్డపై జన్మించినంత మాత్రాన పౌరసత్వం ఇవ్వటం కుదరదంటూ నిరుడు జనవరిలో ట్రంప్ తీసుకొచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వును మంగళవారం కొట్టేస్తూ, 6--3 మెజారిటీతో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. తన ఉత్తర్వును ట్రంప్ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అందుకే ఈ కేసు వాద ప్రతివాదాల సమయంలో స్వయంగా హాజరయ్యారు. ఒక అమెరికా అధ్యక్షుడు ఇలా రావటం ఇదే తొలిసారి. తమ తప్పుడు నిర్ణయాలవల్ల దేశంలో అస్తవ్యస్థ స్థితిగతులు ఏర్పడినప్పుడు జనం దృష్టి మళ్లించేందుకు లేదా మిన్ను విరిగి మీద పడే అతి గొప్ప చర్యలు తీసుకుంటున్న అభిప్రాయం వారిలో కలిగించేందుకు ఎక్కడైనా ఇలాగే వ్యవహరిస్తారు. అలాంటివారిలో అగ్రగణ్యుడు ట్రంప్. నిజానికి సుప్రీంకోర్టులో రిపబ్లికన్‌లవైపు మొగ్గుచూపే న్యాయమూర్తుల సంఖ్య అధికంగానే ఉంది.కనుకనే అధ్యక్షుడి కార్యనిర్వాహక అధికార పరిధిని దాటుతూ తీసుకుంటున్న పలు నిర్ణయాలకు అనుకూలంగా ఈ రెండేళ్లలోనూ తీర్పులు వెలువడ్డాయి. అయితే అనేక దేశాలపై అధిక సుంకాల విధింపు, ఇప్పుడు జన్మతః పౌరసత్వం అంశాల్లో మాత్రం ఆయన నిర్ణయాలతో సుప్రీంకోర్టు ఏకీభవించలేక పోయింది. ఇది భవిష్యత్తులో అనేకానేక సమస్యలకు దారి తీస్తుందని గ్రహించింది. ట్రంప్ రెండో ఏలుబడి మొదలయ్యాక న్యాయమూర్తులకు పనిభారం బాగా పెరిగింది. అందుకే హేతుబద్ధత లేకుండా, బహిరంగ విచారణైనా జరపకుండా వారు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న ఉదంతాలున్నాయి. అక్రమ వలసల పేరుచెప్పి జాతి, భాష వంటి కారణాలతో వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేస్తూ వందలమంది భద్రతా బలగాలు విరుచుకుపడటం, అరెస్టులు చేయటం వగైరాలను సుప్రీంకోర్టు నిర్మొహమాటంగా సమర్థించింది. ఆరోగ్య సంరక్షణ గ్రాంట్లపై కోత విధించటం, జాతి, లింగపరమైన మైనారిటీల విషయంలో తీసుకున్న నిర్ణయాలకూ న్యాయమూర్తులు మద్దతుపలకటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆసియాలో మనతో సహా పలు దేశాల్లోనూ... యూరప్, ఆఫ్రికా ఖండ దేశాల్లోనూ జన్మతః పౌరసత్వం ఇవ్వరు. అయితే అమెరికాలో కొన్ని చారిత్రక కారణాలవల్ల ఇందుకు సంబంధించి రాజ్యాంగంలో ఆర్టికల్ 14 పొందుపరిచారు. అమెరికా వలసవచ్చిన వారి తోనే నిర్మాణమైంది. అంతర్యుద్ధం ముగిసి, బానిసత్వం రద్దుకావటం వంటి పరిణామా లతో 1857లో నల్లజాతీయులు అమెరికా పౌరులు కాలేరంటూ సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. నల్లజాతీయుల్ని పీల్చిపిప్పిచేసి సంపద పెంచుకున్న అమెరికా ఇంత కృతఘ్న తతో ఉండటాన్ని ప్రశ్నిస్తూ ఆందోళనలు జరిగాక 1868లో ఈ 14వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. నల్లజాతికి చెందిన మాజీ బానిసలు, వారికి పుట్టిన సంతానం దేశ పౌరులే అవుతారని ఈ సవరణ స్పష్టం చేసింది. చైనా వలస కుటుంబానికి ఇది వర్తించబోదని ప్రభుత్వం నిరాకరించినప్పుడు అమెరికాలో జన్మించిన ప్రతి ఒక్కరూ ఇక్కడి పౌరులే అవుతారని 1898లో సుప్రీంకోర్టు తెలియజేసింది. ట్రంప్ ఉత్తర్వు ఏడాదిన్నరగా లక్షలాదిమందిని అనిశ్చితిలో పడేసింది. రెండేళ్ల క్రితం అమెరికా సెన్సెస్ బ్యూరో దేశంలో 52 లక్షలమంది భారతీయులున్నారని చెప్పింది. నిరుడు వెలువడిన లెక్క ప్రకారం హెచ్--1బీ వీసాలున్నవారిలో 71 శాతం మంది భారతీయులే. వీరందరికీ తాజా తీర్పు ఊరటనిస్తుంది. అయితే గ్రీన్‌కార్డుకు దరఖాస్తుచేసి ఎదురుచూస్తున్నవారికి ఈ తీర్పువల్ల ఉపశమనం దొరకదు. అక్కడ జన్మించినవారి పిల్లలు దేశ పౌరులుగా మారినా, తల్లిదండ్రులకు ఎదురుచూపులు తప్పవు. తమ వీసా దరఖాస్తుల్లో అబద్ధం చెప్పి దేశంలో ప్రవేశించినవారి ఆచూకీ తెలుసుకోవటం, వారిపై ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించటం తమ ప్రాధాన్యతంటూ అమెరికా న్యాయశాఖ చెప్పటం సహజంగానే గుబులు రేపుతోంది. తీర్పు వెలువడ్డాక కూడా కొత్తగా చట్టం తీసుకొస్తానంటూ ట్రంప్ చెప్పటం ఆయన మొండివైఖరికి నిదర్శనం. ఇప్పటికైనా వివేకంతో మెలగటం, అసలైన సమస్యలపై దృష్టిసారించటం అవసరమని ఆయన గ్రహించాలి.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ మరో 11 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం



మొదటిపేజీ తరువాయి - వంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సోలార్ సెల్స్ తయారీలో ఏపీని అగ్రగామిగా నిలపాలని, పెండింగ్‌లో ఉన్న 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టుల వివరాలు:

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ: నెల్లూరులో రూ.139.92 కోట్లతో 4-స్టార్ హోటల్ (180 మందికి ఉపాధి).
2. మాధవి లీజర్ అండ్ స్టేస్: కడపలో రూ.52.10 కోట్లతో 3-స్టార్ హోటల్ (400 మందికి ఉపాధి).
3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్: కడపలో రూ.68.69 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ (690 మందికి ఉపాధి).
4. వజ్ర హాస్పిటాలిటీ: విజయవాడలో రూ.62.40 కోట్లతో హోటల్, బ్యాంక్వెట్ సెంటర్ (450 మందికి ఉపాధి).
5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్: తిరుపతి జిల్లాలో రూ.255 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (400 మందికి ఉపాధి).
6. అక్షత్ గ్రీన్‌టెక్: అనకాపల్లి జిల్లాలో రూ.1,600 కోట్లతో సోలార్ సెల్, మాడ్యూల్ యూనిట్ (750 మందికి ఉపాధి).
7. బెర్రీ అలాయ్స్: బొబ్బిలిలో రూ.1,200 కోట్లతో మాంగనీస్ సిన్టర్ ప్లాంట్ (831 మందికి ఉపాధి).
8. జియో మైసూర్ ఇండియా: కర్నూలు జిల్లా తుగ్గలిలో రూ.689 కోట్లతో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ (1,750 మందికి ఉపాధి).
9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ (గూగుల్ వేర్‌హౌస్ పార్ట్‌నర్స్): విశాఖలో రూ.1,008 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (5,000 మందికి ఉపాధి).
10. అదానీ ఫౌండేషన్: విశాఖ జిల్లా కపులుప్పాడలో రూ.2,200 కోట్ల ప్రాజెక్టు.
11. మొండెలీజ్ ఇండియా ఫుడ్స్: శ్రీ సిటీలో రూ.1,801 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (80 మందికి ఉపాధి).

గత రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా, మొత్తం 339 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.11.86 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.41 లక్షల ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయాలతో పారిశ్రామికంగా రాష్ట్రం మరింత బలోపేతం కానుంది.

# ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి పుట్టినిల్లు



మొదటిపేజీ తరువాయి - భావించే గుర్రపుడెక్క ఆకుతో కూడా కళాకృతులు రూపొందించారని గుర్తుచేశారు. హస్తకళాకారుల హెల్త్ ఆడిట్ చేయాలని అధికారులను ఆదేశించారు.విజయవాడ అంబేడ్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హస్తకళాకారుల స్టాళ్లను పరిశీలించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి బొమ్మలను ఆసక్తిగా చూశారు. హస్తకళాకారుల గ్రామాలను పర్యాటకంతో అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో చేనేత, హస్తకళల సలహాదారు సుచిత్రా ఎల్లా సూచించిన ప్రతిపాదనను పవన్ అభినందించారు.“సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. కళాకారుల అద్భుత ప్రతిభ వారి కష్టాన్ని గుర్తించడానికి వచ్చా. అద్భుత కళల వెనుక లక్షలమంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారు. రాష్ట్రంలో రెండు లక్షలమందికి పైగా కళాకారులు ఉన్నారు. మూడో వంతుకు పైగా అవార్డులు సాధించామంటే కళాకారుల ప్రతిభకు ఇదే నిదర్శనం. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దిశ. గుర్రపుడెక్క ఆకుతో కూడా వస్తువుల తయారీ చూస్తున్నాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు, పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు.ఒక ఇంటి నుంచి ప్రారంభమైన వస్తువుకు ప్రపంచ మార్కెట్‌లో గిరాకీ లభిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి, ప్రపంచానికి చేరాలనేదే లక్ష్యం. తల్లిదండ్రుల కళను పిల్లలు కూడా అనుసరించేలా చేయాలి. మనందరం కలిసి కళాకారులను ప్రోత్సహిద్దాం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు, లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పనిచేద్దాం. ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు.అనారోగ్య సమస్యల నుంచి కళాకారులను కాపాడాలి. తొలుత కళాకారులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలి. హస్తకళాకారుల పిల్లలు చదువు కునేలా ఏర్పాట్లు చేయాలి. వంశపార పర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలా లు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాలి. వస్తువుల తయారీలో కొత్త ఆవిష్కరణలు రావాలి” అని పవన్ కల్యాణ్ తెలిపారు.“కళాకారుల ప్రతిభ ప్రపంచానికి తెలియాలి. పిల్లలు, వారి తల్లిదండ్రుల కళను వారసత్వంగా కొనసాగించాలి. సంప్రదాయం గుర్తుచేసు కోవడానికి కాదు, మరింత ముందుకు సాగాలి. లోకల్ టు గ్లోబల్ రీతిన మన హస్తకళలు ప్రపంచానికి చేరాలి. మన వస్తువులకు మార్కెటింగ్ పెరగాలి. కళారూపాలకు మూలాధారమైన కర్ర నిల్వ అవసరం. కళాకారులపై కేసులు లేకుండా చేశాం. హస్త కళాకారుల కోసం కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తాం. భారతదేశ ఉనికికి హస్త కళారూపాలు మూలం. హస్త కళాకారుల కోసం ప్రభుత్వం దన్నుగా నిలబడు తుంది. ప్రతి కళాకారుడికి ఒక కథ, ఒక కష్టం ఉంటుంది. హస్తకళల గ్రామాలను పర్యాటకంగా అనుసం ధానం చేయాలి.హస్త కళాకారుల సమస్యలపై కేబినెట్‌లో ప్రస్తావిసామన్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.

# వయనాడ్‌లో మరోసారి విరిగిపడిన కొండచరియలు

మొదటిపేజీ తరువాయి - ఆందోళన నెలకొంది. స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అదే ప్రాంతంలో కొన్ని ఇళ్లు, హోమ్‌స్టేలు కూడా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. టన్నెల్ ప్రాజెక్టు సిబ్బందిని తరలించే కొన్ని వాహనాలు కూడా మట్టికుప్పల కింద దెబ్బతిన్నాయి. ఘటన సమాచారం అందుకున్న వెంటనే కల్పెట్ట అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. మీనంగాడిలో ఉన్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని తక్షణమే ఘటనాస్థలికి పంపించగా, కోజికోడ్ నుంచి మరో బృందాన్ని కూడా తరలించారు. సహాయక సిబ్బంది ఇప్పటివరకు ఒక మృతదేహాన్ని వెలికితీశారు. గాయపడిన ఏడుగురిని తక్షణమే ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్న మరో ఏడుగురి కోసం రెస్క్యూ సిబ్బంది, పోలీసులు గాలిస్తున్నారు.సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఘటనా స్థలంలో కార్మికులు ఎవరూ లేరని, ఇంజనీర్లు, భద్రతా సిబ్బంది శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని అని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి విలేకరులతో చెప్పారు. ఒకవేళ పని జరుగుతూ ఉండి ఉంటే ఇంకా పెను ప్రమాదంగా మారేదని చెప్పారు. అయితే భారీగా పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు భారీ ఎర్త్‌మూవింగ్ యంత్రాలు అవసరమని స్థానికులు తెలిపారు. మట్టికుప్పలను తొలగించిన తర్వాతే పూర్తిస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. కొండచరియల కారణంగా మలప్పురం – వయనాడ్ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు, మీనాక్షి వంతెన వద్ద నది ఉప్పొంగి ప్రవహిస్తోంది.

### ముఖ్యమంత్రి అత్యవసర సమీక్ష

ఘటనపై కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అత్యవసర సమీక్ష నిర్వహించారు. జిల్లా మంత్రులతో సమావేశమై సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన కొనసాగించాలని ఆదేశించారు. మంత్రులు ఏపీ అనిల్‌కుమార్, టీ సిద్ధిక్ వెంటనే వయనాడ్‌కు వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు.

### ‘సహజ విపత్తు కాదు- మానవ తప్పిదమే’

ఈ ఘటనపై స్పందించిన మంత్రి సిద్ధిఖీ సహజంగా సంభవించినది కాదని, మానవ తప్పిదం వల్లే జరిగిందని అన్నారు. తవ్వకాల నుంచి వెలికితీసిన మట్టిని శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేయకపోవడంతో అది భారీ వర్షాలకు జారిపడి ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని ప్రస్తుతం వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని చెప్పారు.

### భయానక దృశ్యాలు వైరల్

ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మీనాక్షి వంతెన సమీపంలో భారీ మట్టికుప్ప ఒక్కసారిగా కిందకు జారిపడుతుండగా, అక్కడున్న ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీసిన దృశ్యాలు అందులో కనిపించాయి. “వేగంగా పరుగెత్తండి ప్రాణాలు కాపాడుకోండి” అంటూ ప్రత్యక్ష సాక్షి హెచ్చరిస్తున్న శబ్దం కూడా వీడియోలో వినిపించింది. క్షణాల్లో చెట్లు నేలకూలడం, నిర్మాణ ప్రాంతంలోని ఇనుప బారికేడ్లు మట్టిలో కొట్టుకుపోవడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది.

### రెడ్ అలర్ట్ జారీ

గత 24 గంటల్లో వయనాడ్ ప్రాంతంలో 265 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైనట్లు కేఎస్‌డీఎంఏ తెలిపింది. దీంతో మంగళవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. కోజికోడ్‌కు రెడ్, మలప్పురం, కన్నూర్, కాసరగోడ్ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను జారీచేసింది.

# ఏపీకి పెట్టుబడుల వేట

మొదటిపేజీ తరువాయి - దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు.సియోల్‌లో ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్–జు కోహ్?తో లోకేశ్ భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్‌తో సమావేశమై... విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్‌తో సమావేశమైన లోకేశ్, ఏపీలో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా... ఏపీని డేటా సెంటర్లు, సర్వర్ తయారీకి భారతదేశపు స్థావరంగా మార్చాలని ప్రతిపాదించారు.ఈ సందర్భంగా క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 150 క్యూబిట్‌ల క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు నుంచి, దాని తయారీ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ బిజీ షెడ్యూల్ మధ్య ఆయన ఎల్జీ సైన్స్ పార్క్ లో రోబోతో ఫొటో దిగారు.


# భోగాపురం విమానాశ్రయం సిద్ధం!

మొదటిపేజీ తరువాయి - నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తాం

మొదటిపేజీ తరువాయి - లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నామని వెల్లడించారు. 2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పెట్రోల్ బంకులకు స్థలాలు ఇచ్చి మహిళలు నడిపేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. అంతకు ముందు నాచారంలో బాలామృతం ప్లాంటు ప్రారంభించిన సీఎం ప్లాంటు ఆవరణలో మొక్క నాటారు. రూ.40 కోట్లతో బాలామృతం ప్లాంటు నిర్మించారు. బాలామృతం ప్లాంటు లోపల ప్రత్యేక ప్రదర్శన సీఎం తిలకించారు. ప్లాంటు ప్రత్యేకతలను నిర్వాహకులు సీఎంకు వివరించారు. బాలామృతం తయారీ విధివిధానాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్లాంటు ద్వారా గంటకు 18 టన్నుల, నెలకు 10 వేల టన్నుల బాలామృతం తయారవుతుంది. మూడేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందించేలా బాలామృతం తయారు చేస్తున్నారు.

# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు



మొదటిపేజీ తరువాయి - మాట్లాడిన కిషన్ రెడ్డి సింగరేణికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కేలా కేంద్రం చొరవ తీసుకుందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాక్‌ల వేలంలోనూ సింగరేణి పాల్గొనేలా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.నైనీ కోల్ బ్లాక్‌లో మరో 35 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. తెలంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారం సింగరేణి అని పేర్కొన్నారు. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ బ్లాక్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి పెరగడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

# ఇండోనేషియాకు భారత్ బ్రహ్మోస్ క్షిపణులు

మొదటిపేజీ తరువాయి -

ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్‌గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. ఆస్త్రా ఎయిర్–టు–ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి.భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

# కడియం శ్రీహరిపై రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి - అధికారికంగా ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరి ప్రభుత్వ పరిపాలనా విధానాలను, మంత్రిగా తన అధికార పరిధిని పూర్తిగా బేఖాతరు చేశారని ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లారు.దేవాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, కీలక నిర్ణయాలు, అధికారిక సమీక్షలన్నీ పూర్తిగా సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకే వస్తాయని కొండా సురేఖ స్పష్టం చేశారు. కానీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని... దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, భూముల పరిరక్షణ వంటి అంశాలపై సమీక్ష చేశారని లేఖలో మండిపడ్డారు. అంతేకాకుండా అధికారులకు డెడ్‌లైన్లు కూడా పెట్టడం పరిపాలనా పరంగా తీవ్ర అభ్యంతరకరమని, ఇది ప్రభుత్వ ‘రూల్స్ ఆఫ్ బిజినెస్’ స్ఫూర్తిని నిలువునా ఉల్లంఘించడమేనని తేల్చిచెప్పారు.రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న కడియం శ్రీహరికి... శాఖా పరమైన నిర్ణయాలు మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలనే కనీస విషయం తెలియదా అని కొండా సురేఖ నిలదీశారు. తనను పూర్తిగా పక్కనపెట్టి ఇలాంటి సమీక్షలు చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో చెడు సంప్రదాయానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయానికి కారణమవుతాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని... అలాగే పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కొండా సురేఖ కోరారు.

# పార్టీ పేరు వివాదం.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత



మొదటిపేజీ తరువాయి - కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించాలని కోరుతూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇవ్వాలని కవితకు సూచించింది. ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోవడం ఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుందని కోర్టు స్పష్టం చేసింది.బీఆర్ఎస్ పార్టీ పాత పేరు ‘తెలంగాణ రాష్ట్ర సమితి’ని పోలి ‘టీఆర్ఎస్’ అనే సంక్షిప్త నామం వస్తుండటంతో, దీనిపై జూన్ 23న కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పేరు ప్రజల్లో గందరగోళానికి దారితీస్తుందని పేర్కొన్న ఈసీ, 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కవితను ఆదేశించింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ ఆదేశాలనే కవిత కోర్టులో సవాలు చేశారు.బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత, ఈ ఏడాది ఆరంభంలో సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రతిపాదించిన ‘తెలంగాణ రక్షణ సేన’ పేరుకు ఏప్రిల్‌లో ఈసీ ప్రాథమిక ఆమోదం తెలిపింది. అయితే, ఈ పేరులోని ‘టీఆర్ఎస్’ అనే సంక్షిప్త రూపం పాత పార్టీని గుర్తుచేస్తోందంటూ 1,100కు పైగా అభ్యంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం కవితకు నోటీసులు జారీ చేసింది.

# చరిత్ర సృష్టించిన మోదీ.. ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని

**ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా నరేంద్ర మోదీ**

**రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరుదేశాల మధ్య చారిత్రక బంధం ఉందని వ్యాఖ్య**

**ఈవీఎంల తయారీలో సాయం, ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు భారత్ సిద్ధమని ప్రకటన**

**భారత పథకాలపై ఇండోనేషియా అధ్యక్షుడి ప్రశంసలకు ‘మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు’ అని చమత్కారం**



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు.భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటున అందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, “మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు” అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

# బాలామృతం ప్లాంట్ ప్రారంభించిన సీఎం మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

**నాచారం,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు నాచారంలోని తెలంగాణ ఫుడ్స్‌లో నూతన బాలామృతం ఉత్పత్తి కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం బాలామృతం తయారీ, ప్యాకింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఫహీమ్, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి , పరమేశ్వర్ రెడ్డి,చర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించిన కార్యక్రమం నేడు పెద్ద పరిశ్రమగా ఎదిగిందని అన్నారు. ఆ ప్రయాణంలో మరో ముందడుగుగా ఆధునిక బాలామృతం ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారతే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నామని చెప్పారు. వెయ్యి బస్సుల యాజమాన్యాన్ని మహిళలకు అప్పగించడంతో పాటు వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్





ప్రాజెక్టును కూడా మహిళల ఆధ్వర్యంలో అమలు చేస్తున్నామని వివరించారు.రాష్ట్రంలోని కోట్లాది ప్రజలకు సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పట్టణ పేదల కోసం లక్ష ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పేద పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టామని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా భోజన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని, విద్యార్థుల ఆరోగ్యం, నాణ్యమైన విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. ఇది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాదు, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. చివరగా, రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఓటరు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్య పరిరక్షణ

## స్వచ్ఛమైన ఓటరు జాబితాతో సమగ్ర తెలంగాణ నిర్మాణం


**జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితానే వెన్నెముక. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా, విశ్వసనీయంగా సాగాలంటే ఓటరు జాబితా ఖచ్చితంగా ఉండటం అత్యంత అవసరం. అందుకే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు కావడానికి అవకాశం కల్పించాలి. కొత్తగా అర్హత పొందిన యువత, ఉద్యోగాల నిమిత్తం నగరాలకు వచ్చిన వారు, చిరునామా మారిన కుటుంబాలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, అట్టడుగు వర్గాల ప్రజలు ఎవరూ ఈ ప్రక్రియలో వెనుకబడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. అనుమానాస్పదంగా పేర్ల తొలగింపు, తప్పుల నమోదు, చిరునామా మార్పుల విషయంలో పారదర్శక విధానాన్ని అనుసరించి ప్రజలకు సులభంగా అభ్యంతరాలు తెలియజేసే అవకాశం కల్పించాలి. ప్రతి దరఖాస్తును నిష్పాక్షికంగా పరిశీలించి అర్హుల హక్కులను పరిరక్షించాలి. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక ఘట్టం. ఇది కేవలం ఎన్నికల కోసమే కాదు, ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే బాధ్యతాయుత కార్యక్రమం. అందుకే రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడే దిశగా అధికారులు,ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి.అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పరిపాలన మరింత సమర్థవంతంగా ఉండాలి. పేదలు, మహిళలు, రైతులు, యువత, కార్మికులు, వృద్ధులు, దివ్యాంగులు వంటి అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండటం, దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడం, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం కూడా అంతే ముఖ్యమైన అంశాలు. హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో కూడా ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నగరంలో రహదారుల విస్తరణ, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయాల మెరుగుదల, ట్రాఫిక్ నియంత్రణ, మెరుగైన ప్రజా రవాణా, చెరువుల సంరక్షణ, పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపు, పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి ఫలాలు నగరంలోని ప్రతి కాలనీ, ప్రతి బస్తీ, ప్రతి కుటుంబానికి చేరినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.ప్రజాస్వామ్య బలోపేతానికి స్వచ్ఛమైన ఓటరు జాబితా ఎంత అవసరమో, ప్రజా సంక్షేమం కోసం సమర్థవంతమైన పాలన కూడా అంతే అవసరం. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం, ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగిపోకుండా



చూడటం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చడం, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయవచ్చు. ఇదే బలమైన ప్రజాస్వామ్యానికి, సమగ్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నిజమైన మార్గం. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్షర టైమ్స్ ప్రతినిధి గోపగాని పాండు

# కుషాయిగూడ అభివృద్ధికి మరో అడుగు సీసీ రోడ్ల పనులను పరిశీలించిన బొంతు శ్రీదేవి

**కుషాయిగూడ,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు కుషాయిగూడ డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కుషాయిగూడ బస్తీతో పాటు శిశు మందిర్ పాఠశాల ఆవరణలోని ఐదు గల్లీల్లో సుమారు రూ.70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పనుల పురోగతిని స్వయంగా పరిశీలించిన బొంతు శ్రీదేవి, నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్లు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా నాణ్యమైన నిర్మాణ సామగ్రిని వినియోగించడంతో పాటు ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం, నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో





భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అభివృద్ధి పనులను మంజూరు చేసిందని బొంతు శ్రీదేవి తెలిపారు. కుషాయిగూడలో దశాబ్దాలుగా ఎదురవుతున్న రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ సీసీ రోడ్లు పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో బురద, నీటి నిల్వలు, రాకపోకల ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని పేర్కొన్నారు.ప్రజాధనం ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని, పనులను నిర్ణీత గడువులోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆమె ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో ప్రజల సూచనలు, అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ కుషాయిగూడను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు.

# కాలనీల అభివృద్ధే లక్ష్యం.. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భరోసా

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీలో విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు,దేవాలయ అభివృద్ధిపై వినతులు..

**కాప్రా,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీకి మెరుగైన మౌలిక వసతులు కల్పించి ప్రజలకు సౌకర్యవంతమైన జీవన వాతావరణాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కార్యాలయాలకే పరిమితం కాకుండా నేరుగా కాలనీల్లోకి వెళ్లి తెలుసుకోవడం ద్వారా వేగంగా పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో తాను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె. సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కాలనీ పర్యటనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాలనీలోని ప్రధాన వీధులు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ స్తంభాలు, వీధిదీపాలు తదితర ప్రాంతాలను స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. ప్రతి వీధిలో ఆగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్లేలా చర్యలు ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు తమ ప్రాంతంలో సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా కారణంగా తరచూ తక్కువ వోల్టేజ్ సమస్యలు ఎదురవుతున్నాయని, గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సింగిల్ ఫేజ్‌ను త్రీ ఫేజ్‌గా మార్చాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను ఇతర ప్రాంతాలకు





మార్చాలని, పాడైపోయిన వీధిదీపాలను తొలగించి కొత్త ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే దెబ్బతిన్న సీసీ రోడ్లను పునర్నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బంగారు మైసమ్మ దేవాలయం అభివృద్ధి పనులకు కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. కాలనీవాసుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ప్రజల అవసరాలే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యమని తెలిపారు. కాలనీల అభివృద్ధిలో ఎక్కడా నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వబోమని, ప్రజలు సూచించిన ప్రతి అంశాన్ని సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పర్యటన జరుగుతుండగానే విద్యుత్ శాఖ సహాయ డివిజనల్ ఇంజినీర్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడి కాలనీలోని విద్యుత్ సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే మిగిలిన సమస్యలపై కూడా ఇంజినీరింగ్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు వంటి మౌలిక వసతులు ప్రతి కాలనీలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు చేరుకుని పరిష్కార మార్గాలు చూపించే విధంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి అఖిల్, ఉపాధ్యక్షులు పి. శ్రీనివాస్, బి. కృష్ణ, సహాయ కార్యదర్శులు మునీర్, మల్లేష్, ఖజానాదారు ఎ. శ్రీనివాస్, సలహాదారు పరమేష్, సభ్యులు కె. అరుణ్, మాదేశ్, శివకృష్ణ, కిరణ్, ప్రసాద్, ఎస్. కృష్ణ, రాజేష్, దామోదర్, ఎస్. రామచందర్, రామస్వామి, రాజయ్య, శ్రీనివాస్, శ్రీధర్, రాజు, చర్లపల్లి కార్పొరేటర్ అభ్యర్థి మహేష్ గౌడ్, సీసీఎస్ కాలనీల అధ్యక్షుడు పద్మారెడ్డి, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భారతి నగర్ అభివృద్ధిపై మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి దృష్టి: జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం

**పటాన్చెరు,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.వీరేష్ పటాన్‌చెరు నియోజకవర్గం, భారతి నగర్ డివిజన్ సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి పనుల వేగవంతం కోసం మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి చొరవ చూపారు. ఈ మేరకు ఆమె శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ని కలిసి, డివిజన్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు. ప్రధాన డిమాండ్లు: బీడీఎల్ కాలనీ భద్రత: బీడీఎల్ కాలనీలో పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి తక్షణమే కంపౌండ్ వాల్ నిర్మించాలని, అలాగే పాడైపోయిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్ మరమ్మతులను వెంటనే చేపట్టాలని కోరారు. కమ్యూనిటీ హాల్ అద్దె తగ్గింపు: సామాన్య ప్రజలపై భారం తగ్గించేందుకు బొంబాయి కాలనీ కమ్యూనిటీ హాల్ అద్దె ఛార్జీలను హేతుబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాలు:




ఎంఎంటీఎస్ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం, ఫెన్సింగ్ పనులు మరియు ఎల్ఐజీ కాలనీలో హౌస్ నెం. 511 సమీపంలో షెడ్ నిర్మాణంతో సహా పెండింగ్‌లో ఉన్న పలు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ సింధు ఆదర్శ్ రెడ్డి వివరించిన సమస్యలను జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ సానుకూలంగా స్వీకరించారు. డివిజన్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పెండింగ్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల సింధు ఆదర్శ్ రెడ్డి చూపుతున్న చొరవను స్థానిక కాలనీవాసులు అభినందిస్తున్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరం

## మందుముల పరమేశ్వర్‌రెడ్డి





**ఉప్పల్,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి హరి మోహన్ రెడ్డి ఉప్పల్ లో సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ కూడా సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నట్టుగా తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంతోష్ కుమార్ రూ.లక్ష 1,30,000 వేలు మహమ్మద్ రఫీ రూ.60 వేలు బీ శ్రీనివాసరెడ్డి రూ.60 వేలు శ్రీకాంత్ రూ.60వేలు జె వీరు రూ.34 వేలు బొర్రల అరుణ రూ.27 వేల చొప్పున మంజూరైన చెక్కులను పరమేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందచేశారు.ఈ కార్యక్రమంలో , కాంగ్రెస్ పార్టీ, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బీరప్ప గడ్డ డివిజన్ అధ్యక్షుడు ఆకిటి ఆగం రెడ్డి, చిలకనగర్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, బజార్ జగన్నాథ్ గౌడ్, రాజేష్, నవీన్ యాదవ్, కుషాంగుల సతీష్ ముదిరాజ్, తూర్పాటి జంగయ్య, శ్రీరాములు, కాజా మూలన, సత్యనారాయణ, జగదీష్ ముదిరాజ్, శ్రీను, మంగళ నాగరాజ్, ఫహీమ్, వహీద్, , గీత మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు

# కుషాయిగూడలో యువతి అదృశ్యం

**కుషాయిగూడ,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 28 ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటన ఆందోళన కలిగిస్తోంది. హైటెన్షన్ లైన్, చక్రిపురానికి చెందిన కే. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆమె కుమార్తె అలేఖ్య (28) జూలై 6 రాత్రి సుమారు 11 గంటలకు నిద్రించేందుకు తన గదికి వెళ్లింది. అనంతరం జూలై 7 తెల్లవారుజామున సుమారు 3 గంటలకు కుటుంబ సభ్యులు గదికి వెళ్లి చూడగా ఆమె కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ యువతి ఆచూకీ లభించకపోవడంతో కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు



కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల వివరాల ప్రకారం అలేఖ్య వయస్సు 28 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5.5 అడుగులు. ఆమె తెలుగు, ఇంగ్లీష్ భాషలు మాట్లాడగలదని తెలిపారు. యువతి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కుషాయిగూడ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# కుషాయిగూడ చర్లపల్లి సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు బొంతు శ్రీదేవి యాదవ్ వినతి


**కాప్రా,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుషాయిగూడ, చర్లపల్లి డివిజన్లలో నెలకొన్న ప్రజా సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం మేడ్చల్-- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికు వినతిపత్రం సమర్పించారు. ప్రజలకు ప్రభుత్వ



సంక్షేమ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందాలంటే స్థానికంగా పెండింగ్‌లో ఉన్న మౌలిక, పరిపాలనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె కోరారు. వినతిపత్రంలో సుబోదయ కాలనీ, సోనియా గాంధీ నగర్ కాలనీలకు కొత్త రేషన్ దుకాణం మంజూరు చేయాలని, గణేష్ నగర్, సుబోదయ, గాంధీ నగర్, న్యూ విరాట్ కాలనీ, జేకే కాలనీ తదితర ప్రాంతాల్లో 58, 59 జీవోల ప్రకారం పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు ఇంటి నెంబర్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బీఎన్‌రెడ్డి కాలనీ, చిన్న చర్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడం, కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం నిర్మించడం, బీఎన్‌రెడ్డి యూఎల్‌సీ సమస్యలను పరిష్కరించి అర్హులకు పట్టాలు అందజేయాలని కోరారు.ఈ సమస్యల పరిష్కారంతో వేలాది కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి సత్వర చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు ప్రభు గౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడ హరివిల్లు కాలనీలో ఘనంగా

## శ్రీ వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు పాల్గొన్న ఐలాపూర్ మాణిక్ యాదవ్



**బీరంగూడ,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ బీరంగూడ విభాగం పరిధిలోని హరివిల్లు కాలనీలో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారిని భక్తిప్రపత్తులతో దర్శించుకున్న ఐలాపూర్ మాణిక్ యాదవ్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో తులతూగాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, సనాతన ధర్మ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తున్న కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు, కాలనీ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. శ్రీ వీరాంజనేయస్వామి ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## స్వయం ఉపాధితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు జేరి రామచందర్ యాదవ్

**నల్లగండ్లలో 'గంగమ్మ టీ స్టాల్'ను ప్రారంభించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు**



**శేర్లింగంపల్లి,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న యువత ఇతరులపై ఆధారపడకుండా స్వయం శక్తితో, సొంత నైపుణ్యాలతో వ్యాపార రంగంలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జేరి రామచందర్ యాదవ్ పిలుపునిచ్చారు. గచ్చిబౌలి నల్లగండ్ల పరిధిలోని గుల్మోహర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన గంగమ్మ టీ స్టాల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ... యువత ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా తమలో ఉన్న ప్రతిభకు పదును పెట్టి స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలన్నారు. ప్రస్తుత రోజుల్లో యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కష్టపడే తత్వంతో సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటూ, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. "సొంత వ్యాపారాలు ప్రారంభిస్తూ యువత స్వయం సమృద్ధి సాధించడం అభినందనీయం. ఇలాంటి యువ పారిశ్రామికవేత్తలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి." --- జేరి రామచందర్ యాదవ్ ఘనంగా ప్రారంభోత్సవం: టీ స్టాల్ ప్రొప్రైటర్ కొత్తూరు మనోజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిపురం హరికృష్ణ చారి, నేతాజీ నగర్ యూత్ నాయకుడు భరత్, మరియు స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా ప్రారంభమైన 'గంగమ్మ టీ స్టాల్' దినదినాభివృద్ధి చెందాలని, వ్యాపారపరంగా మనోజ్ ముదిరాజ్ మరిన్ని విజయాలు సాధించాలని అతిథులు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలు



**కుక్కునూరు,జులై 07 .అక్షర టైమ్స్ :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ దళిత హక్కుల నాయకుడు మందకృష్ణ మాదిగ 62వ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎంఆర్పీఎస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కేక్ కట్ చేసి మందకృష్ణ మాదిగకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాడిద ఉమా మహేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ ఉద్యమాన్ని ఎప్పటికీ మరువలేమని, ఆయన జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. "మందకృష్ణ మాదిగ అనేది ఒక వ్యక్తి కాదు, ఒక ఉద్యమం. ఆయన జీవితమే మాదిగ సమాజానికి వెలుగు" అని ప్రశంసించారు. మందకృష్ణ మాదిగ 2025లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారానికి అర్హత పొందిన విషయం తెలిసిందే. ఆయన నేతృత్వంలో ఎంఆర్పీఎస్ గత 32 ఏళ్లుగా మాదిగ వర్గానికి న్యాయం కోసం అనేక ఉద్యమాలు చేపట్టింది. ఈ పుట్టినరోజు వేడుకలు మాదిగ ఉద్యమానికి మరింత ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో దామోదర్ రావు, గాడిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పోడు పేరిట అటవీ విధ్వంసం..!

**3 ఎకరాల ఫారెస్ట్ భూమి చదును.. నిందితుడిపై కేసు నమోదు**

**30 40 ఏళ్ల నాటి భారీ వృక్షాలు నేలమట్టం.. ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానికుల డిమాండ్**




**కుక్కునూరు,జులై 07 .అక్షర టైమ్స్ :** పోడు వ్యవసాయం పేరుతో అటవీ భూములను ఆక్రమిస్తూ విలువైన వృక్షాలను నరికివేస్తున్న ఘటనలు కుక్కునూరు మండలంలో కొనసాగుతున్నాయి. తాజాగా మండలంలోని కొండపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు మూడు ఎకరాల భూమిని సాగుకు అనువుగా చదును చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం, బర్లమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల భారీ వృక్షాలను యంత్రాల సహాయంతో నరికివేసి అటవీ భూమిని సాగుకు సిద్ధం చేశాడు. ఈ ఘటనతో పర్యావరణ ప్రేమికులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అటవీ శాఖ అధికారులు మాత్రం కొత్తగా నరికిన పోడు భూమి సుమారు ఎకరంన్నర మాత్రమేనని, గతంలో ఉన్న పాత పోడు భూమితో కలిపి మొత్తం మూడు ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉంటుందని పేర్కొన్నారు. అటవీ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆక్రమణకు గురైన భూమిని తిరిగి అటవీ శాఖ స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై అమరవరం రేంజ్ రెంజర్ హరి గోపాల్‌ను వివరణ కోరగా, అటవీ భూమిలో పోడు నరికిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అటవీ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

## రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోరుకొండలో 'పెన్ డౌన్' నిరసన




**కోరుకొండ,జులై 07 .అక్షర టైమ్స్ :** కోరుకొండ,ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణల పేరుతో తీసుకువచ్చిన జీవో నెంబర్ 396ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో 'పెన్ డౌన్' (విధుల బహిష్కరణ) మరియు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల వ్యవస్థను పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో ప్రైవేటీకరించే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు మరియు డీటీపీ ఆపరేటర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. లేఖర్ల ఆందోళన ఎన్నో ఏళ్లుగా ఈ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వేలాది మంది దస్తావేజు లేఖర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని, ఈ కొత్త జీవో వల్ల వారి ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సేవలను ప్రైవేట్ సంస్థలకు లేదా సేవా కేంద్రాలకు అప్పగించడం వల్ల రిజిస్ట్రేషన్ ఫీజులు పెరిగి, ఇళ్ల స్థలాలు, భూములు కొనుగోలు చేసే సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి జీవో 396ను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ పెన్ డౌన్ నిరసన కారణంగా కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ల తయారీ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు మరియు స్టాంప్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ఆరోగ్యమే లక్ష్యం..

**చెర్లపల్లిలో మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన**






**చర్లపల్లి,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు చర్లపల్లి పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో చెర్లపల్లి పారిశ్రామిక వేత్తల సంఘం, చెర్లపల్లి పారిశ్రామిక సంఘం (ఐలా), లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డెన్ జూబిలీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విశేష విజయాన్ని సాధించింది. ఈ శిబిరాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నీలిమ ఆసుపత్రి, ఎమ్ఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ఎమ్.ఎస్. రెడ్డి లయన్స్ ఆసుపత్రి వైద్య నిపుణుల సేవలతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు మూడు వేల మందికి పైగా కార్మికులు, స్థానిక ప్రజలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు ఎముకల సంబంధిత వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, మహిళల ఆరోగ్య పరీక్షలు, మధుమేహం, రక్తపోటు తదితర అనేక విభాగాల్లో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి ఆరోగ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ 350 మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించగా, 200 మందికిపైగా అర్హులకు ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. అవసరమైన వారికి తదుపరి చికిత్సల కోసం వైద్యుల సూచనలు కూడా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, చెర్లపల్లి పారిశ్రామిక వాడ రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందిందని, ఇక్కడ వేలాది మంది కార్మికులు పరిశ్రమల అభివృద్ధికి తమ శ్రమను అందిస్తున్నారని అన్నారు. వారి ఆరోగ్యం పరిరక్షించడం పరిశ్రమల యాజమాన్యాలు, సేవా సంస్థలు, ప్రజాప్రతినిధులందరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు తరచూ నిర్వహించడం అభినందనీయమని, సమాజానికి ఎంతో ఉపయోగపడే కార్యక్రమమని కొనియాడారు. ఈ మెగా వైద్య శిబిరానికి కార్మికులు, పరిశ్రమల ప్రతినిధులు, స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య సేవలతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం వంటి అంశాల్లో ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం, రక్తదాన శిబిరం బుధవారం (జూలై 8) కూడా కొనసాగనుంది. స్వచ్ఛందంగా రక్తదానం చేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెర్లపల్లి పారిశ్రామిక వేత్తల సంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాస్ రెడ్డి, టీఐఎఫ్ అధ్యక్షుడు కె. సుధీర్ రెడ్డి, నీలిమ ఆసుపత్రి చైర్‌పర్సన్ ఎస్. నీలిమ, ఐలా అధ్యక్షుడు డాక్టర్ కె. గోవిందా రెడ్డి, ఫెట్సియా కోశాధికారి కె. హరీష్ రెడ్డి, పి.ఎస్. మోహన్, సుధాకర్ రెడ్డి, రాఘవయ్య, గంగాధర బాబు, శ్రీనివాస్, రాజు, తాటి శ్రీనివాస్, సురేష్, వీరమోహన్, రవీందర్ పునుగోటి, విశ్వేశ్వరరావు, శివ అసోసియేషన్ కమిటీ సభ్యులు, పారిశ్రామిక వేత్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం రూ.27 లక్షల పనుల ప్రారంభం

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పనుల ప్రారంభం**





**చర్లపల్లి,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు ఉప్పల్ నియోజకవర్గంలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరో అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాలనీలో రూ.27 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం, మురుగు నీటి పారుదల సమస్యలు గణనీయంగా తగ్గి స్థానిక ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించబడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కాలనీల అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గడ్డల పాండు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సోమసాని అశోక్, చర్లపల్లి ఉమ్మడి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ గౌడ్, గౌరవాధ్యక్షుడు మొగిలి రాఘవరెడ్డి, సలహాదారులు పుట్ట సహదేవ్ గౌడ్, రణధీర్ రెడ్డి, సంతోష్ గుప్తా, కోశాధికారి జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కొండారెడ్డి, ఉప కోశాధికారి యాకయ్య, సంయుక్త కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఎర్రయ్య, ప్రచార కార్యదర్శి చంద్రారెడ్డి, కమిటీ సభ్యులు రవీందర్ గంగపుత్ర, మసూద్ రెడ్డి, తన్నీరు వెంకటేష్, నాగరాజు గుప్తా, రాజు ముదిరాజ్, గట్టు వెంకటేష్ గుప్తా, ఆర్. కృష్ణతో పాటు వెంకటరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గంగిరెడ్డి, రామ్ రెడ్డి, ఆర్టీసీ సత్తన్న, వెంకటేశ్వరరావు, వినోద్ నాయి, శ్రీనివాస్ గుప్తా, రాజిరెడ్డి, సైదా నాయక్, శ్రీను నాయక్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై అభివృద్ధి పనుల ప్రారంభాన్ని స్వాగతించారు.

## శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనుల జోరు శ్రీరాంనగర్ కాలనీలో రూ.40 లక్షలతో సిసి రోడ్డు పనుల ప్రారంభం







**శేరిలింగంపల్లి,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం. ఈరన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా దూసుకుపోతున్నాయి. కాలనీల రూపురేఖలను మార్చడమే ధ్యేయంగా స్థానిక ప్రజాప్రతినిధులు ముందడుగు వేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ రోజు (06/07/2026) శ్రీరాంనగర్ కాలనీ 'ఎ' బ్లాక్ నందు ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. కాలనీలోని శ్రీరామ హై స్కూల్ నుండి పోలీస్ క్యాంపు పాత గేట్ వరకు ?40 లక్షల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన నూతన సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికేపూడి గాంధీ మరియు కొండాపూర్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, కొబ్బరికాయ కొట్టి వైభవంగా శంకుస్థాపన చేశారు. ఘనంగా ఏర్పాట్లు చేసిన వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు కాలనీ వాసుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. కాలనీకి విచ్చేసిన ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ మరియు హమీద్ పటేల్‌లకు అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. దశాబ్దాల నాటి రోడ్డు సమస్యకు ఈ నిధులతో మోక్షం లభించబోతుండటంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. క్వాలిటీలో రాజీ పడేదే లేదు: ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ?40 లక్షల వ్యయంతో నిర్మించే ఈ సి.సి. రోడ్డు పనులను గడువులోగా, ఎక్కడా నాణ్యత లోపించకుండా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాలనీల ప్రగతికి స్థానిక అసోసియేషన్లు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కాలనీ వాసులకు శు భాకాంక్షలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న సి.సి. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల శ్రీరాంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకి, మాజీ కార్పొరేటర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, కాలనీ ప్రజలందరికీ అసోసియేషన్ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రజల చెంతకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

**రాజానగరం కార్యాలయంలో అర్జీల స్వీకరణ, తక్షణ పరిష్కారాలు**






**రాజానగరం,జులై 07 .అక్షర టైమ్స్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ నిరంతరం శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు రాజానగరంలోని ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10 గంటల నుండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజలు తమకు ఎదురవుతున్న పలు రకాల సమస్యలపై, వ్యక్తిగత మరియు సామాజిక అవసరాలపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కి స్వయంగా అర్జీలను సమర్పించారు. రైతు సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు వంటి పలు విషయాలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వచ్చిన ప్రతి ఒక్క అర్జీని ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులతో మాట్లాడి వారి సమస్యల తీవ్రతను తెలుసుకున్నారు. అర్జీల స్వీకరణ అనంతరం ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. పలు సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆశతో కార్యాలయానికి వస్తున్నారు. అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా, నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే న్యాయం చేయాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని సహించేది లేదు అని బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే అన్నారు. తమ సమస్యలను ఓపికగా విని, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవ పట్ల నియోజకవర్గ ప్రజలు మరియు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడు దొరకడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అరుంధతిపేటలో రెపరెపలాడిన ఎమ్మార్పీఎస్ జెండా





**పెరవలి,జులై 07 .అక్షర టైమ్స్ :** తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని మరియుపద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నిడదవోలు నియోజకవర్గం ఇంచార్జ్ గాలింకి రాము మాదిగ అధ్యక్షతన మండల అధ్యక్షుడు లక్కవరపు రాజేష్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా కేక్ కట్ చేసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి గ్రామాల్లో ఉండే అరుంధతి పేటలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలతో దళితుల్లో ఉండే భేదాలు పూర్తిగా తొలగిపోయాయని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గాలింకి రాము అన్నారు. దళితుల్లో వెనకబడిన వర్గాలకు సమన్యాయం జరిగిందని అందులో భాగంగానే ఉద్యోగాల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. భవిష్యత్ తరాలకు వర్గీకరణ ఫలాలు అందే విధంగా ప్రతి ఎమ్మార్పీఎస్ కార్యకర్త పనిచేయాలన్నారు. ఉన్నతమైన చదువుల్లో మాదిగ విద్యార్థులు ఉండే విధంగా మాదిగ విద్యార్థి సంఘ నాయకులు కృషి చేయాలన్నారు. చివరగా మండల అధ్యక్షుడు లక్కవరపు రాజేష్ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ప్రతి గ్రామంలో ఉండే మాదిగలను కలుపుకుంటూ పెరవలి మండలంలో ఎమ్మార్పీఎస్ ను బలోపేతం చేసామన్నారు. మండలంలో మాదిగలు ఐకమత్యంగా ఉండాలన్నారు. భవిష్యత్తులో ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలో ఉండే మాదిగల అభివృద్ధి సంక్షే మం రక్షణకే సామాజిక న్యాయం కోసం కృషి చేస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులుకొండేటి యోహాను, తానేటి బాబురావు, గంగోలు మణిబాబు, సిర్ర రాజు, మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ అధ్యక్షుడు సొంగ రాజు, ఉందుర్తివెంకటేష్, నేకూరి కనకరాజు, ఆయా గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు భారీగా పాల్గొన్నారు.

## అమీన్‌పూర్‌లో ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు




**అమీన్‌పూంజులై 07 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని నర్రెగూడెం క్రాస్ రోడ్ వద్ద మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కందుకూరి యేసయ్య సారథ్యంలో స్థానికులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్రెగూడెం క్రాస్ రోడ్ వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మైసకల్లా విజయేంద్ర మాదిగ, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి నటరాజన్ మాదిగ, ఎంఆర్పిఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి బండారి రాజు మాదిగ, రాంబాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కందుకూరి యేసయ్య మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ ఆశయాలకు అనుగుణంగా అందరూ కలిసికట్టుగా పయనించాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## విద్యార్థులు, మహిళలకు అవగాహన



**నెల్లూరు,జులై 07 .అక్షర టైమ్స్ :** జిల్లా కేంద్రమైన నెల్లూరులోని కనుపర్తిపాడు గ్రామంలో జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థులకు ఆత్మహత్యల నివారణ, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం ఐసిడిఎస్ పీడీ, ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా బి. హేనా సుజన్ ఆదేశాల మేరకు మంగళవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. 26"ప్రివెన్షన్ ఆఫ్ సూసైడ్ (ఆత్మహత్యల నివారణ)" అంశంపై సఖి వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ జి. సాధన మరియు డిసిపియు నుంచి పి మంజుల పాల్గొని విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువు, కుటుంబం లేదా ఇతర వ్యక్తిగత కారణాలతో ఎదుర్కొనే సమస్యలకు ఆత్మహత్య ఎప్పటికీ పరిష్కారం కాదని, ప్రతి సమస్యకు ఒక పరిష్కార మార్గం ఉంటుందని వివరించారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులతో తమ సమస్యలను పంచుకొని, అవసరమైతే మానసిక కౌన్సిలింగ్ పొందాలని సూచించారు. యుక్తవయస్సులో భావోద్వేగాలకు లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ జి సాధన మరియు డి సి పి యు నుండి ఎల్సిపిఓ పి మంజుల. అవగాహన కల్పించగా, కనిపర్తిపాడులోని జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్. జి. వెంకటేశ్వర్లు మరియు పి.రేఖ ఇతర స్కూల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఈవ్ టీజింగ్ పై ప్రత్యేక దృష్టి సారిస్తా..

### పొదలకూరు నూతన ఎస్సై శివ రాకేష్



**పొదలకూరు,జులై 07 .అక్షర టైమ్స్ :** రిపోర్టర్ ఆనంద్ ఈవ్ టీజింగ్ పై ప్రత్యేక దృష్టి సారించి, ఆకతాయిల ఆగడాలను అరికడతామని పొదలకూరు ఎస్ఐ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివ రాకేష్ పేర్కొన్నారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ పొదలకూరు లో మూడు డిగ్రీ కాలేజీలు మూడు ఇంటర్మీడియట్ కాలేజీలు ఉన్నాయని ఎవరైనా ఈవ్ టీజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇల్లీగల్ యాక్టివిటీస్ ని అరికడతామన్నారు. త్వరలో లోకల్ బాడీ ఎలక్షన్స్ వచ్చే అవకాశం ఉన్నందున గ్రామాలు ప్రశాంతంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు ప్రాధాన్యతను ఇస్తామని చెప్పారు. కాలేజీల్లో డ్రగ్స్ వంటి ఇల్లీగల్ యాక్టివిటీస్ జరుగుతుంటే అరికడతామన్నారు. ఎక్కడైనా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నా.. వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నెల్లూరు జిల్లాతో తనకు పదకొండు సంవత్సరాల సాన్నిహిత్యం ఉందన్నారు. మున్సిపాలిటీ కాబోయే పొదలకూరులో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండల ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన పోలీస్ స్టేషన్ ప్రాంగణ సమీపంలో ఉన్న విఘ్నేశ్వర స్వామిని, మారుతి నగర్ లో ఉన్న అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు జరిపారు.

## పొదలకూరులో ఘనంగా హనుమజ్జయంతి అనంతర ఉత్సవాలు




**పొదలకూరు,జులై 07 .అక్షర టైమ్స్ :** రిపోర్టర్ ఆనంద్ పొదలకూరు పట్టణంలోని మారుతీనగర్‌లో వెలసి ఉన్న శ్రీ వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి అనంతర వారోత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గత దశాబ్ద కాలంగా హనుమ జ్జయంతి అనంతరం వరుసగా 13 మంగళవారాల పాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎనిమిదవ మంగళవారం ఉత్సవాలను పొదలకూరు మండల శాలివాహన కుమ్మర్ల సేవా సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు విశేషంగా పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాంజనేయులు, అర్చకులు వేణుకుమార్ స్వాములు వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం జరిపారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## డిప్యూటీ సీఎం సార్ ఆశ వర్కర్ సమస్యలను పరిష్కరించాలి సిఐటియు.

**18000 ఫిక్స్ వేతనం ఇవ్వాలి**

**ప్రతినెల ఒకటో తారీఖున పారితోషకాలు చెల్లించాలి.**

**50 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ కల్పించాలి.**



**బోనకల్,జులై 07 .అక్షర టైమ్స్ :** సీఎం డిప్యూటీ సీఎం సార్ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించండి సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు సిఐటియు మండల కన్వీనర్ గుగులోత్ నరేష్ డిమాండ్ చేశారు ఆశా వర్కర్ల ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఆశా వర్కర్లకు ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగింది. ఈ హామీని పరిష్కరించమని ఆశా వర్కర్లు కోరుతున్నారు ఆశా వర్కర్లు పారితోషకాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారు ఈఎంఐలు కట్టలేక ఆశా వర్కర్లు అల్లాడుతున్నారు రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకొని ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మదిర డివిజన్ కార్యదర్శి రా మన సరోజినీ ఆశా వర్కర్లు మరీదు లీలా కుమారి గద్ద తులసి గంగుల విజయలక్ష్మి కొంగర వెంకటరమణ కుక్కల నారాయణ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు

## గోకవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న బ్రాందీ షాప్ తొలగించాలి

**ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నిరసన**

**కర్ణాకుల వీరాంజనేయులు డిమాండ్**




**గోకవరం,జులై 07 .అక్షర టైమ్స్ :** గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న బ్రాందీ షాప్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గోకవరం మండలం శివరాంపట్నం గ్రామంలో లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థినులు, విద్యార్థులు అధికంగా రాకపోకలు సాగించే బస్టాండ్ వంటి బహిరంగ ప్రదేశంలో మద్యం దుకాణం ఉండటం ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో మద్యాన్ని దశలవారీగా నియంత్రిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం ప్రజల మధ్యలోనే బ్రాందీ షాపులకు అనుమతులు ఇవ్వడం విచారకరమని విమర్శించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు తమ బాధ్యతలను విస్మరించి, రాజకీయ అండదండలతో ఇటువంటి షాపులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. అలాగే గ్రామాల్లో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న బ్రాందీ షాప్‌ను వెంటనే తొలగించడంతో పాటు అక్రమ బెల్ట్ షాపులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయనడిమాండ్ చేశారు. లేకపోతే ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రమేష్, గ్రామ నాయకులు పెద్ద, లక్ష్మణ్, అప్పలరాజు, వీరబాబు తదితరులు, మహిళలు పాల్గొన్నారు..

## మూఢనమ్మకాలపై అవగాహన కల్పించిన మాయాజాల ప్రదర్శన

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం**



**పొదలకూరు,జులై 07 .అక్షర టైమ్స్ :** రిపోర్టర్ ఆనంద్ సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను పారద్రోలేందుకు శాస్త్రీయ దృక్పథం ఎంతో అవసరమని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. పొదలకూరు పట్టణంలోని సాయి విద్యా నికేతన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్వీబీవీడీ జూనియర్ కళాశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక సభ్యుడు చైతన్య కుమార్ మాయాజాల ప్రదర్శన నిర్వహించి, ప్రజలు అద్భుతాలుగా భావించే అనేక విషయాలు వాస్తవానికి శాస్త్రీయ సూత్రాల ఆధారంగా చేసే మ్యాజిక్ విన్యాసాలేనని విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు. మంత్రాలు, చేతబడులు, బాణామతులు వంటి వాటిని నమ్మకుండా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని, ప్రతి విషయాన్ని ప్రశ్నించే అలవాటు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 2025--26 విద్యా సంవత్సరంలో పొదలకూరు పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించి, ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ టి. రవీంద్ర రెడ్డి సహకారంతో అందజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బాలచంద్ర విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ తూపిలి నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకుని సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. విద్యలో రాణించిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణ పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామానాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు

## మాస్టర్ అథ్లెట్ రామసుబ్బమ్మ కన్నుమూత

**ఆమెకు నివాళులు - కుటుంబానికి సంతాపం**



**కావలి,జులై 07 .అక్షర టైమ్స్ :** కావలి మాస్టర్ అథ్లెట్, పలు క్రీడల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించిన మానికల రామసుబ్బమ్మ తన 81 వ ఏట తుదిశ్వాస విడిచారు. మంగళవారం ఆమెకు అంత్యక్రియల కార్యక్రమం జరిగింది. సేకరించిన వివరాల మేరకు సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించారని ఆమె కుమార్తె ప్రభుత్వ ఉపాధ్యాయిని జయలక్ష్మి, కుమారుడు మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ మహేష్ కన్నీళ్ల పర్యంతమై తెలియజేశారు. ఆమె ఇళ్లలో పనులు చేస్తూ, బిడ్డలను ఉన్నత చదువులు చదివించి, ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. ప్రముఖ యానాదిసంఘ నేత అధ్యాపకులు చెంచయ్య ఆమెకు అల్లుడు. గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తుంటారు. కావలిలో రామసుబ్బమ్మ తెలియనివారుండరు. విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాలలో చదివిన రామసుబ్బమ్మ విద్యార్థినిగా క్రీడల్లో రాణించారు. కుటుంబ నేపథ్యం లో ఆమె హైస్కూల్ చదువు ఆపేసి పలువురి ఇళ్లల్లో ఇంటి పనులు, వంట పనులు చేసేవారు. నెల్లూరు మాస్టర్ అథ్లెట్ కోటేశ్వరమ్మతో ఆమెకు పరిచయం కావడంతో మాస్టర్ అథ్లెట్ గా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మాస్టర్ అథ్లెట్ గా పలు పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి కావలికి కీర్తినీ తెచ్చారు. క్రీడలతోపాటు దైవభక్తి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు, ప్రస్తుత కావలి నియోజకవర్గం శాసన సభ్యులు డివి కృష్ణారెడ్డి గతంలో ఆమె ప్రతిభను గుర్తించి, లక్ష రూపాయల నగదు బహుమతిని అందించారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను సత్కరించారు. రామసుబ్బమ్మకి నెల్లూరులో అంత్యక్రియలు నిర్వహిస్తామని వారి కుటుంబం ప్రకటించింది. రామసుబ్బమ్మ మరణం క్రీడారంగానికి తీరని లోటు అని, ఆమె మరణానికి చింతిస్తూ పలువురు నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసారు. గిరిజన మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించాలని కోరుకుంటున్నాం అని తెలిపారు. సందర్భంగా కావలి ఉమెన్ ఫోర్స్ బృందం చాకలికొండ శారద, జి లావణ్య, ఎం పార్వతీ శంకర్, టీ విద్యావతి, ఫాతిమా, ఎం కవిత, నూర్జహాన్, షమీమ్, మనోజ తదితరులు పాల్గొన్నారు. అలాగే మరో సందర్భంగా స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు, విశ్రాంత వసతి గృహ అధికారి షేక్ ఖాదర్ భాష వారి బృందం ఆమెకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించారు.

## రాష్ట్రానికి మళ్లీ కేసీఆర్ గారే శ్రీరామరక్ష.. సామాన్యుల నుంచి వస్తున్న ఒకే ఒక్క మాట

**మధిర,బోనకల్లు లో యూరియా దొరకని దైన్య స్థితిలో**

**కాంగ్రెస్ ప్రభుత్వం: మాజీ జడ్పీ చైర్మన్ తీవ్ర ధ్వజం**



**బోనకల్,జులై 07 .అక్షర టైమ్స్ :** తెలంగాణ రాష్ట్రానికి మళ్లీ కేసీఆర్ దిక్కు, ఆయనే శ్రీరామరక్ష అని ఇవాళ రాష్ట్రంలోని ప్రతి సామాన్యుడు చెప్తున్నాడు. కాంగ్రెస్ మాటలు నమ్మి పొరపాటు చేశామని, కేసీఆర్‌ను ఓడించుకొని పెద్ద తప్పు చేశామని స్వయంగా కాంగ్రెస్‌కు ఓటేసిన వారే ఇవాళ చంపులేసుకుంటున్నారు" అని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. మంగళవారం బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ...గతంలో మొక్కజొన్న పంట నష్టం జరిగితే స్వయంగా కేసీఆర్ ఈ ప్రాంతానికి వచ్చి ఎకరానికి రూ.10,000 ఇస్తామని ప్రకటించి, వెంటనే రైతుల అకౌంట్లలో వేసారని గుర్తుచేశారు. భారతదేశ చరిత్రలోనే మొక్కజొన్నకు ఆ స్థాయిలో సాయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ గారేనని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.15,000 రైతు భరోసా, తులం బంగారం, మహిళలకు రూ.2,500, స్కూటీలు ఇస్తామని చెప్పి ఇవాళ అన్నింటికీ ఎగ్గొట్టిందని మండిపడ్డారు. చివరకు రైతులు యూరియా ఎ రువును తమ సొంత డబ్బులు పెట్టి కొనుక్కుందామన్నా మధిర, బోనకల్లు మండలాల్లో యూరియా దొరకడం లేదన్నారు. రైతులు పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ లోని వత్సవాయి, మక్కపేట, జగ్గయ్యపేటలకు వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సిన దైన్య స్థితికి కాంగ్రెస్ దిగజారిందని విమర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రస్తావన తెస్తూ.. రావినూతలలో బీఆర్ఎస్ అభ్యర్థి సైదా ఓడిపోయినప్పటికీ, కాంగ్రెస్ ఆఫర్ చేసిన ప్రలోభాలకు లొంగకుండా నిలబడ్డారని అభినందించారు. చింతకాని మండలం సీతంపేటలో కాంగ్రెస్ ఆడిన లోపాయికారీ డ్రామాలను గుర్తుచేస్తూ.. ప్రలోభాలకు లొంగిపోయే వాడికి లొంగుబాటే ఉంటుందని, పోరాడే వాడికే విజయాలు వస్తాయని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇవాళకి ఇవాళ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ల సవరణ కార్యక్రమంపై అత్యంత 'సర్' ప్రక్రియపై పార్టీ శ్రేణులను, అప్రమత్తం గా ఉండాలన్నారు. ఈ ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని ఎవరూ చులకనగా తీసుకోవద్దన్నారు. కేవలం బీఎల్ఓలు, అంగన్‌వాడీ టీచర్లు వచ్చి ఫారాలు ఇచ్చి పోతారు, వాళ్లే పూర్తి చేస్తారు అనుకుంటే పొరపాటే. గతంలో ఈ ప్రక్రియ జరిగిన బెంగాల్, తమిళనాడు, బీహార్ వంటి రాష్ట్రాలలో లక్షల సంఖ్యలో ఓట్లు గల్లంతయ్యాయని తెలిపారు. ముఖ్యంగా మైనారిటీల ఓట్లను, పక్కాగా మనకు పడే ఓట్లను మనకు అర్థం కాకుండానే ఓటర్ లిస్ట్ నుండి తొలగించే పెద్ద కుట్ర ఈ కార్యక్రమంలో జరుగుతోందన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకుల వద్దకే ఈ లిస్టులు పోయి ఫైనలైజ్ అవుతాయని అనుమానం వ్యక్తం చేశారు. నేను ఈ ఊర్లోనే పుట్టాను, మా తాతల కాలం నుండి ఇక్కడే ఉన్నాం.. నా ఓటుకేం కాదులే అని నిర్లక్ష్యంగా ఉండకండి. ఒక్కసారి ఈ లిస్టులో ఓటు పోతే మళ్లీ రావడం చాలా కష్టం. అందువల్ల ప్రతి బూత్ పరిధిలోని మన ఏజెంట్లు ముఖ్య నాయకులు ప్రతి ఓటరు చేత బీఎల్ఓలను పిలిపించి వివరాలను ఆన్‌లైన్‌లో కచ్చితంగా అప్‌లోడ్ చేయించుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ, మాజీ రైతుబంధు కన్వీనర్ వేమూరు ప్రసాద్, నాయకులు పారా ప్రసాద్, మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, మూడవత్ సైదా, తన్నీరు పుల్లారావు, బెజవాడ మల్లికార్జునరావు, సత్యనారాయణ, కంచర్ల బాబు, గణపతి, వెంగళ కనకయ్య , షేక్ పెంటు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణ ప్రక్రియను పరిశీలించిన మాజీ జడ్పీ చైర్మన్

**అధికారులు చిన్న పొరపాటు చేసినా ఓట్లు గల్లంతవుతాయి జాగ్రత్త: లింగాల కమల్ రాజ్**



**బోనకల్లు,జులై 07 .అక్షర టైమ్స్ :** బోనకల్లు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ శిబిరాన్ని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్ రాజు మంగళవారం సందర్శించి, పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్ల నుంచి పూర్తి చేసిన సవరణ ఫారాలను తిరిగి స్వీకరిస్తున్న తీరును, నమోదు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు గారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో ప్రతి ఓటరు వివరాలను సేకరించాలని కోరారు. ఓటు హక్కు నమోదు కోసం ఓటర్ల నుంచి అవసరమైన సరైన ఆధారాలను తీసుకొని, వాటిని పక్కాగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ 'సర్' కార్యక్రమంలో అధికారులు ఎటువంటి చిన్న పొరపాట్లు చేసినా సామాన్య ఓటర్ల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని, కావున సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు వేమూరి ప్రసాద్, కాకాని శ్రీనివాసరావు, బంధం నాగేశ్వరరావు, పారా ప్రసాద్, గుండపనేని సుధాకర్ రావు, ఇటికల శ్రీనివాస్, తేల్లూరి రమేష్, షేక్ మీరా సాహెబ్, గద్దల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు,జులై 07 .అక్షర టైమ్స్ :** గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలు, రోగుల వార్డులు, ల్యాబ్, బాత్రూమ్‌లను పరిశీలించి అక్కడి పరిశుభ్రత, మందుల గది, స్టోర్ రూమ్, పేషంట్ లకు అందుతున్న వైద్య సేవలు, చికిత్స విధానం గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి పేషంట్ కి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణాన్ని ఎప్పటికప్పుడు నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. అలాగే రోగులు, వారి సహాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఆసుపత్రిలో సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే వారి కి చేరువగా , పట్టణంలోని , నిరుపేద కుటుంబాలకు, వారి దగ్గర చుట్టుప్రక్కల గ్రామాల్లో లో మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేయాలి అని తెలిపారు , బ్లడ్ బ్యాంక్ ఆసుపత్రి లో ఏర్పాటు చేయాలి, అని తెలిపారు కీళ్ళ ఎముకలు సంబంధించిన పరికరాలకు 2 లక్షల రూపాయలు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటుగా ఆసుపత్రి డాక్టర్లు, సంబంధిత అధికారులు , సిబ్బంది, ఆసుపత్రి కమిటీ సభ్యులు పట్టణ నాయకులు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు

# ధరణి డాక్యుమెంట్లపై విచారణ

**ఆందోళనలో పలువురు తహసీల్దార్లు, డీటీలు**

**యాజమాన్య హక్కుల అక్రమ మార్పిడిపై కలెక్టర్లు సీరియస్**

**అనుమానితులకు నోటీసులు**

**దళారుల ప్రమేయంపైనా దృష్టి**

**ఈ అక్రమంలో సాయం అందించిన మాజీ ధరణి ఆపరేటర్లు**




గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ధరణి పోర్టల్‌లోని సాంకేతిక లొసుగులను ఆసరాగా చేసుకుని జరిగిన భూ దోపిడీపై విచారణ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలను వేగవంతం చేసింది. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 10 వేల ఎకరాలకు పైగా భూముల యాజమాన్య హక్కులను మార్చేసినట్లు ఇప్పటికే గుర్తించగా, ఈ అక్రమం వెనుక కీలకంగా ఉన్న పాత్రధారులు, సూత్రధారులను గుర్తించే పనిలో పడ్డారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఇప్పటికే పలువురిని విచారణ అధికారులు గుర్తించారు.తహసీల్దారు, నాయబ్ తహసీల్దార్లు (డీటీ), ధరణి ఆపరేటర్లను ప్రశ్నించి అనుమానాలు బలపడినచోట సంజాయిషీ సమన్లు జారీ చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో మాజీ రెవెన్యూ ఉద్యోగులు, కొందరు దళారుల పాత్ర వెలుగు చూసినట్లు సమాచారం. కొన్ని జిల్లాల్లో భూ యజమానులకు తెలియకుండానే వారి భూములు ఇతరుల పేర్లపైకి మారడం క్షేత్రస్థాయిలో తీవ్ర కలకలం రేపుతోంది.ధరణి పోర్టల్‌లో పట్టా భూముల యాజమాన్య హక్కులు ఇతరుల పేర్ల మీదకు మార్చాలంటే భూ యజమానికి తెలియకుండా చేయడం అసాధ్యమైన పని. యజమాని ఆధార్, బయోమెట్రిక్, ఫోన్ నంబరు ఉంటేనే హక్కుల మార్పిడి పూర్తి అవుతుంది. యజమాని సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ సంఖ్యను నమోదు చేశాకే కంప్యూటర్‌లో లావాదేవీ ప్రక్రియ ముందుకు సాగుతుంది. ఈ మొత్తం ప్రక్రియకు సైతం మస్కా కొట్టించి ఎకరాలకు ఎకరాలు ఇతరుల పేర్లపైకి అక్రమంగా మార్చేశారు.నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం హాజీపూర్‌లో 1.18 ఎకరాల ఎసైన్డ్ భూమిని ఏ మాత్రం యజమానికి తెలియకుండా వేరే వ్యక్తుల పేర్లపైకి ఎక్కించేశారు. నిషేధిత జాబితాలో (22 ఎ) ఉండే ఎసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్- మ్యుటేషన్ చేయడం అస్సలు సాధ్యం కాదు. పైగా యజమాని, అతని కుటుంబ సభ్యులకు తెలియకుండా చేయడం కుదరదు. కానీ, ఇక్కడ ధరణి ఆపరేటర్, మరి కొంత మంది సిబ్బంది కలిసి టెక్నాలజీని ఉపయోగించి హక్కుల మార్పిడికి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం దీనిపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ చర్యలు తీసుకున్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఐదుగురు రైతులకు చెందిన భూమి వేరే వ్యక్తుల పేర్లపైకి మారింది. రైతులు దీనిని గుర్తించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ అక్రమం బయటకు వచ్చింది. ఈ అంశంపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.రాజధాని హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని కమర్షియల్ ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ లావాదేవీలు పెద్ద ఎత్తున ఉన్నట్లు గుర్తించారని తెలుస్తోంది. పాత్రధారులపై ఆరా క్షేత్రస్థాయిలో అధికారుల్లో గుబులు : రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎన్ఐసీ, సైబర్‌క్రైం తదితర విభాగాలతో ఏర్పడిన దర్యాప్తు బృందం అక్రమార్కులు చేసిన అరాచకాలను వెలికితీస్తోంది. తప్పుడు దారిలో హక్కులు మార్చడానికి ధరణి, ప్రస్తుత భూభారతి పోర్టల్ సాఫ్ట్‌వేర్‌కు ఏ విధంగా గండి కొట్టారనే విషయాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. కొందరు మాజీ ధరణి ఆపరేటర్లు ఈ ప్రక్రియలో సాయం అందించినట్లు సమాచారం. అక్రమాల వెనుక ఉన్న పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర సిబ్బంది కొంత కలవరపాటుకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాల కోసం పోర్టల్ తెరవడానికి ఉపయోగించిన డిజిటల్ లాగిన్‌లను, అక్రమ లావాదేవీల ఫుట్‌ప్రింట్స్‌ను సైబర్ ఎక్స్‌పర్ట్స్ తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం.

# మత్స్యకారుల కోసం మూడో రోజూ సెర్చ్ ఆపరేషన్

**సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా**

**గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న సీఎం చంద్రబాబు**

**మత్స్యకారుల గల్లంతు ఘటనపై విశాఖ వన్‌టౌన్ పీఎస్‌లో కేసు నమోదు**

**తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల పరిధి వరకు గాలింపు**

మత్స్యకారుల కోసం జరుగుతున్న గాలింపు చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. మత్స్యకారుడు కర్రి చిన్న అందించిన కీలక సమాచారం ఆధారంగా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. గల్లంతైన మత్స్యకారుల కోసం నావికాదళం తీరరక్షక దళం నౌకలు, హెలికాప్టర్లతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రెండు నావికాదళ హెలికాప్టర్లు, తీరరక్షక దళ నౌకలు, మెరైన్ పోలీస్ బృందాలు ఈ గాలింపులో పాల్గొంటున్నాయి. పడవ బోల్తా పడిన గంగవరం తీర ప్రాంతం, తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల పరిధి వరకు గాలింపు ప్రాంతాన్ని విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.ఈ గాలింపు , సహాయక చర్యల కోసం తూర్పు నావికాదళ కమాండ్ రెండు యుద్ధనౌకలను, రెండు హెలికాప్టర్లను రంగంలోకి దించిందని తీరప్రాంత భద్రతా విభాగం ఐజీ గోపీనాథ్ జెట్టి ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ముఖ్యంగా ఎత్తైన అలలు, బలమైన గాలులు గాలింపు చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయని అధికారులు తెలిపారు. గల్లంతైన ఆరుగురు మత్స్యకారులను త్వరగా గుర్తించాలని, వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని ముఖ్యమంత్రి యంత్రాంగాన్ని ఆదేశించారు. సహాయక చర్యల పురోగతిపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని కూడా ఆయన అధికారులకు సూచించారు. హోం మంత్రి అనిత మంత్రి అచ్చెన్నాయుడు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ సమన్వయం చేస్తున్నారు.మత్స్యకారులు గల్లంతైన ఘటనపై విశాఖపట్నం వన్-టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గల్లంతైన మత్స్యకారుడు బండయ్య భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పి. వరప్రసాద్ 'మిస్సింగ్ పర్సన్' (గల్లంతైన వ్యక్తి) కేసుగా (కేసు నం. 109/2026) నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**గల్లంతైన వారి వివరాలు :**

ఈ నెల 1న చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆ పడవ బోల్తా పడింది.
ఒకరిని సురక్షితంగా రక్షించగా, మరో ఆరుగురు గల్లంతయ్యారు.
రాగితి బండయ్య (43)
కర్రి గరగయ్య (24)



మేడ చిన అమ్మోరు (48)
కర్రి సీతోడు (55)
కర్రి చిన్నయ్య (32)
అమర అప్పలరాజు (24)

ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు.

గాలింపు చర్యల తాజా సమాచారం: మొత్తం 72 గంటల గాలింపు ప్రక్రియలో 48 గంటల సమయం పూర్తయింది. రెండు తీరరక్షక దళ నౌకలు, మూడు నావికాదళ హెలికాప్టర్లు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. తీరరక్షక దళ ప్రాంతీయ కార్యకలాపాల కేంద్రాన్ని ఐజీ గోపీనాథ్ జెట్టి పర్యవేక్షిస్తున్నారు. వాణిజ్య నౌక ద్వారా రక్షించిన చిన్నకు వైద్య సహాయం అందిస్తోంది. రక్షణ చర్యలకు సంబంధించిన తాజా సమాచారాన్ని ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గల్లంతైన మత్స్యకారులను త్వరగా గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సముద్ర వాతావరణ పరిస్థితుల వల్ల సవాళ్లు ఎదురైనప్పటికీ, రాష్ట్ర, నౌకాదళ విభాగాల సమన్వయంతో మత్స్యకారులను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# సీసీ కెమెరాల ద్వారా వాయు కాలుష్యం అంచనా

**ఏఐతో గాలి నాణ్యతను పసిగట్టే సరికొత్త టెక్నాలజీ**

**డేటాను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం**

**కాలుష్య అంచనాలో ఏఐ 90 శాతం ఖచ్చితత్వం**

**ప్రజలకు కాలుష్య సమాచారం అందేలా సిటీ యాప్ అందుబాటులోకి**



హైదరాబాద్‌లో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతోంది. అయితే కాలుష్యాన్ని కొలవడానికి ఖరీదైన ఎయిర్ క్వాలిటీ సెన్సార్లు వాడుతుంటారు. నగరంలో అడుగడుగునా ఉన్న సీసీ కెమెరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో గాలి నాణ్యతను పసిగట్టే సరికొత్త టెక్నాలజీని హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ పరిధిలోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ అభివృద్ధి చేసింది. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఎలా ఉందో తెలుసుకోవాలంటే ఇప్పటి వరకు కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసే సెన్సార్ల మీదే ఆధారపడాల్సి వస్తోంది. వాటి నిర్వహణ ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న పని. దీనికి చెక్ పెడుతూ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ నిపుణులు ఒక సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు, వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ద్వారా వాయు కాలుష్యాన్ని అంచనా వేసే టెక్నాలజీని అభివృద్ధి చేశారు. దీని ద్వారా రోడ్డుపై ఎంత ట్రాఫిక్ ఉంది ఏయే వాహనాలు వెళ్తున్నాయి చెత్త తగలబెడుతున్నారా లాంటి పరిస్థితులను కెమెరాలో రికార్డు చేయడంతో కాలుష్య తీవ్రతను ఏఐ మోడల్స్ విశ్లేషించి ఇట్టే పసిగడతాయి.సీసీ కెమెరాల ద్వారా సేకరించిన ఈ డేటాను ఎడ్జ్ ప్రాసెసింగ్ ద్వారా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయడం వల్ల క్షణాల్లో కాలుష్య నివేదిక అధికారులకు చేరుతుంది. దీని ఆధారంగా ఏయే మార్గాల్లో కాలుష్యం ఎక్కువగా ఉందో గుర్తించే అవకాశం ఉంటోంది. దీని సాయంతో ట్రాఫిక్ దారి మళ్లించడం, స్కూళ్లు, ఆఫీసుల వేళల్లో మార్పులు చేయడం లాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో మొదట్లో 82 శాతం కచ్చితత్వం రాగా, ఆ తర్వాత మోడల్‌ను మరింత అభివృద్ధి చేశారు. దీంతో ప్రస్తుతం కాలుష్యాన్ని అంచనా వేయడంలో ఏఐ ఏకంగా 90 శాతం కచ్చితత్వాన్ని సాధిస్తోంది."ట్రాఫిక్‌లో ఒక కారు, ఒక లారీ ఉంటే ఈ రెండు వాహనాల నుంచి ఎంత కాలుష్యం వస్తుంది. అలాగే ఒకచోట మంట పెట్టారు. అక్కడ నుంచి ఎంత కాలుష్యం వస్తుందని అంచనా వేయవచ్చు. ఇలా వేరు వేరు సందర్భాల్లో ఎంత కాలుష్యం వస్తుందనేది కెమెరా ద్వారా తెలుసుకోవచ్చు. కెమెరాలో ఉన్న ఫొటో డేటా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌కు వెళ్తుంది. దాంతో ఎంత కాలుష్యం వస్తుందనేది తెలుస్తుంది. ఒక ప్రాంతం నుంచి ఎక్కువ కాలుష్యం వెలువడితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగలుగుతాం. దాంతో ప్రభుత్వం కూడా ఏవైనా నిర్ణయాలు తీసుకోవచ్చు" - వట్టెం అనురాధ, చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్, స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్.ఈ సరికొత్త టెక్నాలజీని ఇప్పటికే ల్యాబ్ ప్రతినిధులు సంగారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సిటీ ఆపరేటింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా డేటాను భద్రంగా ఉంచుతూనే ప్రజలకూ కాలుష్య సమాచారం అందేలా ప్రత్యేక సిటీ యాప్‌ను కూడా డెవలప్ చేస్తున్నారు. ఈ టెక్నాలజీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే సామాన్యులు కూడా తాము రోజూ వెళ్లే మార్గంలో గాలి స్వచ్ఛంగా ఉందో లేదో ముందుగానే తెలుసుకోవచ్చు. ఒకవేళ వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటే వాకింగ్ చేసేవారు వేరే రోడ్డును ఎంచుకోవచ్చు. డేటా ప్రైవసీకి ఎలాంటి భంగం కలగకుండా అత్యంత పకడ్బందీ సెక్యూరిటీతో దీన్ని రూపొందిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ మోడల్‌ను ప్రభుత్వ డేటా సెంటర్‌కు అనుసంధానించి, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టేందుకు మార్గం సుగమం కానుంది. ప్రభుత్వం ఈ టెక్నాలజీని పూర్తి స్థాయిలో అందిపుచ్చుకుంటే హైదరాబాద్ లాంటి మహానగరాల్లో వాయు కాలుష్య నియంత్రణ మరింత సులభతరం కానుంది.

## పెళ్లైన 6 నెలలకే సౌదీకి - 44 ఏళ్లు ఎదురుచూసిన ఆ ఇల్లాలికి మిగిలింది మృతదేహమే

**పాస్‌పోర్టు, వీసాల గడువు ముగిసినా సౌదీలోనే చంద్రయ్య (65)**

**44 ఏళ్ల క్రితం వెళ్లి తిరిగి రాలేదు, ఫోన్ చేయలేదన్న భార్య లక్ష్మి**

**నెల రోజుల క్రితం ఆసుపత్రిలో చనిపోయిన చంద్రయ్య**



వారిద్దరు 1982లో పెద్దల సమక్షంలో పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ఆరు నెలలు గడిచాక ఉపాధి కోసం భర్త గల్ఫ్ దేశం సౌదీకి వెళ్లాడు. 44 ఏళ్ల క్రితం వెళ్లి తిరిగి రాలేదు కదా, కనీసం ఫోన్ కూడా చేయలేదు. నెల రోజుల క్రితం అనారోగ్యంతో అక్కడే చనిపోయాడు. ఇప్పటికే పాస్‌పోర్టు, వీసాల గడువు ముగిసినా కూలీ పనులు చేసుకుంటూ అక్కడే ఉండిపోయాడు. ఇంటికి తిరిగి వెళ్లే దారిలేక సౌదీ అరేబియాలోనే జీవితం కొనసాగించాడు. కొద్ది రోజుల తర్వాత అతడిని దుబ్బాక మున్సిపాలిటీలోని చెల్లాపూర్ రెండో వార్డుకు చెందిన బొట్ల చంద్రయ్య (65)గా అధికారులు గుర్తించారు. మృతదేహాన్ని స్వదేశానికి పంపే ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.బొట్ల చంద్రయ్యకు లక్ష్మితో 1982లో వివాహం జరిగింది. భార్య, వృద్ధులైన తల్లిండ్రులు కిష్టయ్య, బాలవ్వను స్వగ్రామంలోనే విడిచి ఉపాధి కోసం అతడు పెళ్లైన ఆర్నెళ్లకే సౌదీ అరేబియాకు వెళ్లాడు. అప్పటి నుంచి ఎప్పుడూ ఇంటికి రాలేదు. అతడి గురించి క్షేమ సమాచారం తెలియలేదు. కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఆరా తీసినా ఆచూకీ, ఆనవాళ్లు కూడా లభించలేదు.వీసా గడువు ముగిసి - తిరిగి రాలేక : కొన్నేళ్లకు చంద్రయ్య తల్లిదండ్రులు చనిపోయారు. కోడలు లక్ష్మి దగ్గరుండి అంత్యక్రియలు చేశారు. 15 సంవత్సరాల క్రితమే చంద్రయ్య వీసా టైమ్ ముగిసింది. రెన్యూవల్ చేసుకోలేదు. నెల రోజుల క్రితం ఆసుపత్రిలో ప్రాణాలు విడిచాడు. పాత వీసా వివరాల ప్రకారం అతడి స్థానికతను అక్కడి అధికారులు గుర్తించి రాయబార కార్యాలయానికి సమాచారమిచ్చారు. ప్రవాసీ తెలుగు సంఘానికి చెందిన కార్యకర్త ఫారుఖ్ రెండు వారాలుగా కృషి చేసి, వివిధ సోషల్ మీడియాల ద్వారా చంద్రయ్య మరణ వార్తను ప్రసారం చేశారు. ఎట్టకేలకు చివరగా కుటుంబ వివరాలు తెలుసుకున్నారు.గత 44 ఏళ్లుగా భర్త కోసం ఎదురు చూసిన ఆ ఇల్లాలికి చివరికి కన్నీరే మిగిలింది. సౌదీ వెళ్లిన తన భర్త తనకు ఒక్కసారి కూడా ఫోన్ చేయలేదని, ఏనాడూ రూపాయి డబ్బు పంపలేదని భార్య లక్ష్మి తెలిపారు. తనను ఒంటరి మహిళగా గుర్తించిన ప్రభుత్వం పింఛన్ మాత్రం ఇస్తోందన్నారు. భర్త మృతదేహాన్ని ఎలాగైనా ఇక్కడికి తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆమె వేడుకుంటున్నారు.

## కాశీతోటలో విషాదం తనతోపాటు కుమారుడిపై పెట్రోలు పోసి నిప్పంటించుకున్న తల్లి

**కుమారుడిని ద్విచక్ర వాహనంపై తీసుకొని కాశీతోటలోని శివాలయం వద్దకు చేరుకున్న లీలాబాలశ్రావణి**

**నిర్మానుష్య ప్రాంతంలో తనతో పాటు కుమారుడిపై పెట్రోలు పోసి నిప్పంటించుకున్న శ్రావణి**



అప్పుడప్పుడే చీకటి పడుతోంది. అమ్మ స్కూటీ బయటకు తీసింది. గ్రామం దాటి వాహనం వెళుతుండగా చిమ్మ చీకటి. చల్లని గాలులకు శరీరం వణికింది. అది కొన్ని క్షణాల పాటే. తల్లి తీసుకొచ్చిన పెట్రోలు పోసి తనతో పాటు బిడ్డకు నిప్పు పెట్టడంతో పచ్చని తోటల్లో అగ్నికీలలు ఎగిశాయి. చలికి వణికిన శరీరం నిప్పుల కొలిమిలా మారింది. క్షణాల్లోనే తల్లి ప్రాణాలు అగ్నికి ఆహుతి కాగా ఏం జరుగుతుందో తెలియని ఆ బాలుడు ఒళ్లు కాలిపోతోంది కాపాడండీ అంటూ చీకట్లోనే పరుగులు పెట్టాడు. చివరికి ప్రాణాలు విడిచాడు.క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో రెండు ప్రాణాలు కోల్పోయిన ఘటన తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటగిరి పట్టణంలోని ఆత్మామాలిక్ ధ్యాన మందిరంలో నాగేశ్వరశర్మ పండితుడిగా పని చేస్తున్నారు. ఆయనకు భార్య లీలాబాలశ్రావణి (35), కుమారుడు చంద్రమౌళి (9), ఓ కుమార్తె (7) ఉన్నారు. లీలా బాలశ్రావణి సోమవారం సాయంత్రం కుమారుడిని ద్విచక్ర వాహనంపై తీసుకొని కాశీతోటలోని శివాలయం వద్దకు చేరుకున్నారు. నిర్మానుష్య ప్రాంతంలో తనతో పాటు కుమారుడిపై పెట్రోలు పోసి నిప్పంటించుకుంది. మంట వేడి తాళలేక చంద్రమౌళి కేకలు వేస్తూ తుప్పల్లో పరుగులు తీశాడు. సమీపంలోని ఆటో డ్రైవర్లు గమనించి ఆరా తీయగా తన తండ్రి సెల్‌ఫోన్ నంబరు ఇచ్చి సమాచారం తెలియజేయాలని కోరాడు.విషయం తెలుసుకున్న నాగేశ్వరశర్మ అక్కడి చేరుకున్నారు. భార్య చనిపోయి ఉండటంతో చేసేది లేక కుమారుడిని తీసుకొని తిరుపతి బయలుదేరాడు. సగం దూరం వెళ్లేసరికి బాలుడు సైతం ప్రాణాలు కోల్పోయాడు. వీరిద్దరూ బయటకు వచ్చిన సమయంలో కుమార్తె ఆడుకోవడానికి వెళ్లిపోవడంతో ప్రాణాలతో బయటపడిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న సీఐ రోశయ్య, ఎస్సై స్వరూప అక్కడకి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## రూ.70 వేలు లంచం.. ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన చేర్యాల తహసీల్దార్

**సిద్దిపేట జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్**

**చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు**

**నాలా కన్వర్షన్ కోసం రూ.70,000 డిమాండ్ చేసినట్లు ఆరోపణ**



సిద్దిపేట జిల్లాలో ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చేర్యాల తహసీల్దార్‌గా విధి నిర్వహణలో ఉన్న కొర్రా దిలీప్ నాయక్, రూ.70,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నాగపురి గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించి 11 నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి) దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం ఫిర్యాదుదారుడి నుంచి తహసీల్దార్ ఈ లంచం డిమాండ్ చేశారు. జమున కనకమ్మ మరియు ఇతరుల పేర్లపై ఉన్న 30 గుంటల భూమికి సంబంధించిన పనుల నిమిత్తం ఆయన ఈ మొత్తాన్ని తీసుకున్నారు.సోమవారం మధ్యాహ్నం చేర్యాలలోని తన కార్యాలయంలోనే దిలీప్ నాయక్ లంచం తీసుకుంటుండగా, పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే తమ టోల్-ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.



# కష్టాల్లో కాపాడేవాడే నిజమైన రాజు'.. ట్రైలర్ రిలీజ్

రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా వస్తోన్న లేటేస్ట్ మూవీ రాజా ది రాజా. ఈ చిత్రానికి అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌లో దాసరి నిహారిక నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్.


ఈ ట్రైలర్ చూస్తుంటే రాజు అనే కాన్సెప్ట్ ప్రధానంగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. రాజుల కాలానికి.. ప్రజెంట్‌కు లింక్ పెట్టి ఈ కథను రూపొందించినట్లు ట్రైలర్‌లో కనిపిస్తోంది. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఈ కథలో ఉండనున్నాయని ట్రైలర్‌లో చూపించారు. ఈ సినిమాకు మార్క్ కె రాబిన్ సంగీతమందించారు. ఈ మూవీలో సాయి కుమార్, నరేశ్, అవసరాల శ్రీనివాస్, విష్ణు, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, భద్రం, మైమ్ మధు, ఆనంద్ కీలక పాత్రల్లో నటించారు. ఇంకెందుకు ఆలస్యం ట్రైలర్ మీరు కూడా చూసేయండి.

# అఖిల్‌పై ఆ భయం ఉండేది.. 'లెనిన్' చూసి ఆశ్చర్యపోయా : నాగార్జున



"లెనిన్' రాయలసీమ కథ. సింపుల్‌గా చెప్పాలంటే సీమలో జరుగుతున్న మహాభారతం. ఈ సినిమాకు ముందు అఖిల్ ఎక్కువగా అర్బన్ ఫిల్మ్ చేశాడు. మరి... ఈ సినిమాకి సూట్ అవుతాడా? అని ముందు నాకు భయంగా ఉండేది. కానీ సినిమా చూశాక, నేను కాదు... అందరూ ఆశ్చర్యపోయారు. 'లెనిన్' రోల్‌లోకి అఖిల్ వెళ్లిపోయాడు. సినిమా చూసిన తర్వాత లెనిన్ స్నేహాన్ని, ప్రేమను, పగని కూడా ప్రేమిస్తారు. లెనిన్ ను మీరు ఇంటికి తీసుకెళ్లిపోతారు. మీకు అఖిల్ కనపడడు... 'లెనిన్ ' కనిపిస్తాడు" అని నాగార్జున అన్నారు. అఖిల్, భాగ్యశ్రీ భోర్సే హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లెనిన్ '. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మురళీ కిషోర్ అబ్బూరు (నందు) దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఆదివారం తిరుపతిలో జరిగిన 'లెనిన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున మాట్లాడుతూ–– "ప్రేమ కోసం యుద్ధాలు జరిగాయి. ప్రేమకోసం రాజ్యాలు కూలిపోయాయి. 'లెనిన్'లో కూడా ఒక ప్రేమకథ ఉంది. నందు ఈ సినిమా కథ చెప్పడానికి వచ్చినప్పుడు ఇది శ్రీరామపురంలో జరిగే కథ అన్నాడు. 'శ్రీరామపురం' అంటే మా నాన్నగారు పుట్టిన ఊరు (కృష్ణా జిల్లా). అయితే ఈ శ్రీరామపురం చిత్తూరు జిల్లాలో అని చెప్పాడు. కానీ శ్రీరామపురం అంటే నాకో సెంటిమెంట్. దీంతో నందును కథ చెప్పమన్నాను. నందు కథ చెప్పడం మొదలు పెట్టాడు. ఇందులో పాత్రలు డిఫరెంట్‌గా అనిపించాయి. 'లెనిన్' సెకండాఫ్‌లోని ట్విస్ట్‌లను ప్రేక్షకులు ఊహించలేరు. మా పార్ట్‌నర్ నాగవంశీకి ఈ సినిమాపై ఎంత కాన్ఫిడెన్స్ అంటే... ఏపీ అంతా అతనే డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడు. మన అందరికీ దేవుడు ఆ వెంకటేశ్వరస్వామి. నాన్నగారు ఎప్పుడూ అంటుంటారు ఆయనకు దేవుడు మాత్రం ప్రేక్షక దేవుళ్ళు అని. సో... ఈ ప్రేక్షక దేవుళ్లకు చెబుతున్నాను. జూలై 10న వస్తున్నాం. మనవాడు కొడుతున్నాడు" అని అన్నారు. అఖిల్ మాట్లాడుతూ–– "లెనిన్'ఉద్దేశం ఒకటే. నేను మీ ఇంటివాడినైపోవాలి. మీ సీమ బిడ్డ మురళీకిషోర్ రెండేళ్ల క్రితం ఈ సినిమా కథ చెప్పారు. నేను చేయాలనుకున్న కథ ఇదే అనిపించింది" అన్నారు. "ఈ మూవీలో భారతి అనే పాత్ర చేశాను. ఈ సినిమా నా కెరీర్‌లో చాలా స్పెషల్" అన్నారు భాగ్యశ్రీ బోర్సే. "నాగేశ్వరరావుగారి మనవడు, నాగార్జునగారి అబ్బాయి అఖిల్ గోల్డెన్ స్పూన్ తో పుట్టాడు. పెద్ద కష్టపడలేదని అంటుంటారు. కానీ సోల్ ఆఫ్ లెనిన్ వచ్చినప్పట్నుంచి 'అఖిల్ ఫస్ట్ టైమ్ కష్టపడుతున్నట్లు కనిపిస్తుంది కదరా' అనేవాళ్లు. ఈ అభిప్రాయాన్ని జనాల్లోకి తీసుకుని వెళ్లేందుకు అఖిల్‌గారు ఎంత కష్టపడ్డారో మేం చూశాం. ఇది రెగ్యులర్ మాస్ మూవీ కాదు. రెండు మూడు చోట్ల ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. అలాంటి స్క్రీన్‌ప్లే రాశాడు నందు" అన్నారు నాగవంశీ. బ్రహ్మాజీ, సునీల్ మాట్లాడారు.

# ఫుల్ స్పీడ్‌లో రవితేజ.. 'ఇరుముడి' రిలీజ్‌కు ముందే కొత్త సినిమా, శ్రీవిష్ణుతో మల్టీస్టారర్?




మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.వీశీజఱవం హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

# అఖిల్ అక్కినేని 'లెనిన్' లో తారక్ రోల్ ఏంటీ.. హైప్ పెంచేస్తున్న నయా పోస్టర్



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడని తెలిసిందే. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ లాంచ్ చేసిన కొత్తపోస్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఈ మూవీలో జూనియర్ ఎన్టీఆర్ కూడా భాగం కాబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. అదెలా అంటే తాజా పోస్టర్‌లో టైగర్ లుక్‌తో పాటు లెనిన్ టైటిల్ లోగోను చూడొచ్చు. ఇంతకీ ఈ కొత్త పోస్టర్ వెనుకున్న సీక్రెట్ ఏంటంటే.. ఈ చిత్రానికి యంగ్ టైగర్, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ అందించడమే కాకుండా సినిమా కథనాన్ని వివరించబోతున్నాడట. ఈ పోస్టర్‌తో సినిమాలో తారక్ రోల్ ఏంటనేది క్లారిటీ ఇచ్చేసినట్టేనని అర్థమవుతోంది. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు.

# ఓటీటీలోకి వచ్చి రెండు రోజుల్లోనే మాయమైన 'సత్లుజ్'.. ఈ సినిమా వెనుక ఇంత పెద్ద కథ ఉందా?




సాధారణంగా ఒక సినిమా విడుదలకు ముందు ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటుంది. సెన్సార్ సమస్యలు, కోర్టు కేసులు, ఆర్థిక ఇబ్బందులు, టైటిల్ వివాదాలు వంటి కారణాలతో సినిమాలు వాయిదా పడటం కొత్త విషయం కాదు. అయితే ఓటీటీలో విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే స్ట్రీమింగ్‌ను నిలిపివేయడం మాత్రం అరుదుగా జరిగే పరిణామం. ఇప్పుడు పంజాబీ స్టార్ నటుడు, గాయకుడు దిల్జిత్ దొసాంజే ప్రధాన పాత్రలో నటించిన 'సత్లుజ్' సినిమా ఇదే కారణంగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పంజాబ్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. 1990లలో పంజాబ్‌లో అదృశ్యమైన పలువురు వ్యక్తుల కేసులను పరిశోధించి కీలక ఆధారాలను వెలికితీసిన ఖల్రా, అనంతరం 1995లో హత్యకు గురయ్యారు. ఆయన జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారంగా తీసుకుని దర్శకుడు హనీ ట్రెహన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. మొదట ఈ సినిమాకు 'ఘల్లుఘరా' అనే టైటిల్ ప్రకటించారు. అనంతరం దాన్ని 'పంజాబ్ 95'గా మార్చగా, చివరికి ఓటీటీ విడుదల సమయంలో 'సత్లుజ్' పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సినిమా 2022లోనే పూర్తయినప్పటికీ విడుదల మాత్రం సాధ్యం కాలేదు. కారణం సెన్సార్ వివాదాలు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) మొదట కొన్ని హింసాత్మక సన్నివేశాలు, సంభాషణలు, టైటిల్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ 21 మార్పులు సూచించింది. నిర్మాతలు ఆ మార్పులు చేసిన తర్వాత మళ్లీ సెన్సార్‌కు వెళ్లగా, ఈసారి ఏకంగా 127 కట్స్ సూచించినట్లు సమాచారం. అంతటి మార్పులు చేస్తే సినిమా అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని భావించిన చిత్రబృందం కోర్టును ఆశ్రయించింది. దీంతో సినిమా విడుదల మరింత ఆలస్యమైంది. థియేటర్లలో విడుదలకు మార్గం సుగమం కాకపోవడంతో, చిత్రబృందం ఎలాంటి హడావుడి లేకుండా జూలై 3న జీ5 (జుజు5) ఓటీటీ వేదికగా 'సత్లుజ్'ను విడుదల చేసింది.ఈ సందర్భంగా హీరో దిల్జిత్ దొసాంజే స్పందిస్తూ.. ఓటీటీలో విడుదలైనది పూర్తిస్థాయి ఒరిజినల్ వెర్షనేనని, ఒకవేళ కట్స్ చేసి విడుదల చేసి ఉంటే తాను ఆ సినిమాను ప్రమోట్ కూడా చేసేవాడిని కాదని స్పష్టం చేశారు. అయితే విడుదలైన రెండు రోజులకే భారతదేశంలో జీ5 ప్లాట్‌ఫామ్ నుంచి సినిమా కనిపించకుండా పోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దీనిపై స్పందించిన జీ5 యాజమాన్యం.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సినిమాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, చట్టపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశం ఉందని తెలిపింది. అయితే సినిమా తొలగింపుకు అసలు కారణం ఏమిటన్న విషయాన్ని మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. దీంతో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు మొదలయ్యాయి.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com